క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

హైదరాబాద్

7-11-2026

వెల: రూ.5/-

పేజీలు: 10+10

సంపుటి:16

సంచిక:230

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



తెలంగాణలో కొత్త పథకం!

రాష్ట్రంలో ప్రతి పౌరుడికి జీవిత బీమా రక్షణ

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా అమలు

రూ. 5 లక్షలతో కుటుంబ రక్షణ

సరికొత్త సంక్షేమ పథకానికి రేవంత్ సర్కార్ శ్రీకారం చుట్టింది. తెలంగాణలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత, సామాజిక భరోసా కల్పించే లక్ష్యంతో ముందడుగు వేసింది. రాష్ట్రంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి 5 లక్షల రూపాయల జీవిత బీమా పథకాన్ని అధికారికంగా అమలు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది.


క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని నవంబర్ 12న సిద్దిపేటలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రతిష్టాత్మక పథకాన్ని ప్రారంభించనున్నారు. పేద మధ్యతరగతి వర్గాల్లో కుటుంబ పెద్దన కోల్పోయినప్పుడు ఆ ఇల్లు రోడ్డున పడకుండా ఆదుకునేందుకు ఈ పథకం ఒక బలమైన రక్షణ కవచంలా నిలవనుంది. గతంలో ఏపీ ప్రభుత్వం చంద్రన్న బీమా పథకాన్ని అమలు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కూడా తెలంగాణలో ఆ బీమా పథకం మాదిరిగానే అమలు చేసేందుకు రావణ్ సర్కార్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

లోటుపాట్లు లేకుండా...: ఈ బీమా పథకానికి సంబంధించి అమలు ప్రక్రియను ఎక్కడా లోటుపాట్లు జరగకుండా.. క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు అధికార యంత్రాంగం గట్టి కార్యాచరణను

మిగతా 3లో

కొత్త ల్యాండ్ పూలింగ్!

తెలంగాణలో నూతన ల్యాండ్ పూలింగ్ చట్టం అమల్లోకి వచ్చింది. మౌలిక వసతుల ప్రాజెక్టుల వేగానికి భూసేకరణ వివాదాలు ప్రతి బంధకంగా మారకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఔటర్ రింగ్ రోడ్, రీజనల్ రింగ్ రోడ్డు, మూసి రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్, సాటిలైట్ టౌన్షిప్ ల నిర్మాణంలో ఎదురవుతున్న భూ సమీకరణ సవాళ్లకు శాశ్వత పరిష్కారంగా... నూతన ల్యాండ్ పూలింగ్ పాలసీకి చట్టబద్ధత కల్పించే దిశగా నోటీసులు విడుదల చేసింది.



రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

భూ సమీకరణ సవాళ్లకు శాశ్వత పరిష్కారం

పూర్తి చట్టబద్ధత

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: దశాబ్దాలుగా నష్టపరిహారం చెల్లింపుల్లో జరుగుతున్న ఆలస్యం, న్యాయపరమైన వివాదాలు, రైతుల ఆందోళనలకు స్వస్తి పలికి, ప్రాజెక్టు నిర్వాసితులను నేరుగా ప్రాంతీయ అభివృద్ధిలో భాగస్వాములను చేయడమే ఈ పాలసీ ప్రధాన ఉద్దేశం.

మెరుగైన ప్లాట్లు తిరిగి..: భూములు కోల్పోయే రైతులకు కేవలం ఒకేసారి నగదు రూపంలో పరిహారం

మిగతా 2లో

రామచంద్ర రావుది

గొప్ప సాహసమే!

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ



రంగారెడ్డి- హైదరాబాద్- మహబూబ్నగర్ స్థానం నుంచి బరిలోకి

గతంలో గెలుపు, ఓటములు

రిస్క్ అంటున్న విశ్లేషకులు

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: తెలంగాణలో పట్టభద్రుల ఎన్నికల సందడి మొదలైంది. మరోవైపు గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు సైతం ఖాళీ అవుతున్నాయి. అంతటా ఆశావహుల సందడి



ఏపీలో 'కియా' విస్తరణ

రూ. 12,500 కోట్ల పెట్టుబడి తో సరికొత్త ప్లాంట్

విశాఖ గ్లోబల్ సమ్మిట్ లో ఒప్పందం

భారీగా పెరగనున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: ఏపీ విషయంలో గుడ్ న్యూస్ చెప్పింది కియా కార్ల కంపెనీ. రాష్ట్రంలో ఆటోమొబైల్ రంగాన్ని మరింత



అమెరికా అధ్యక్షు రేసు నుంచి

వివేక్ రామస్వామి ఔట్!

ఓహియో గవర్నర్ ఎన్నికల్లో పరాభవం

కొంపముంచిన ట్రంప్ విధానాలు

వైట్ హౌస్ రేసులో చాలా కష్టం

క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్ : అమెరికా రాజకీయాల్లో కీలక పరిణామం. మిడ్ టర్మ్ ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్ కు గట్టి షాక్ తగిలింది.

మిగతా 2లో

మైనార్టీ సంక్షేమానికి

కొత్త అడుగులు..

భట్టి కీలక ప్రకటన! స్టడీ సర్కిళ్ల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్

మైనార్టీ విద్యార్థులకు భట్టి గుడ్‌న్యూస్!

ఈజిప్ట్, సౌదీ అరేబియాలోనూ చదువుకునే అవకాశం..

షాదీ ముబారక్ నుంచి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ వరకు సమీక్ష

ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పరిధిలోకి మరో రెండు దేశాలు

మైనార్టీ స్టడీ సర్కిళ్ల కోసం ప్రత్యేక భవనాలు

షాదీ ముబారక్, ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లపై సమీక్ష



మిగతా 3లో



కాంగ్రెస్ దీపావళి స్కెచ్!

పండుగ నాడు ఇందిరమ్మ ఇళ్లలో దీపాల వెలుగులు

హాజరుకానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు

ప్రతిపక్షాల విమర్శలకు చెక్

మిగతా 2లో

తీవ్ర నైరాశ్యంలో వైసిపి!

స్థానిక సంస్థల ఎన్నికల్లో వరుస పరాజయాలు

మున్సిపల్ ఎన్నికల్లో ఏకపక్షం

ప్రాదేశిక పోలింగ్ లోను స్పష్టమైన సరళి

తేలిపోతున్న సీనియర్ల మాటలు

క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్ర నిరాశలో కూరుకుపోయింది. మున్సిపల్ ఎన్నికల్లో ఏకపక్ష విజయాలను కూటమి దక్కించుకుంది. వైసీపీ కనీస స్థాయిలో కూడా ప్రభావం చూపలేకపోయింది. ఈ నేపథ్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర నిరాశలో కూరుకుపోయాయి. ఇటువంటి సమయంలో





ఏపీలో 'కియా' విస్తరణ



(మొదటి పేజీ తరువాయి)

పటిష్టం చేసే దిశగా నిర్ణయం తీసుకుంది. ఏపీలోని అనంతపురం తయారీ కేంద్రం కార్యకలాపాలను విస్తరించేందుకు ఏకంగా 1.5 బిలియన్ డాలర్లు అంటే.. సుమారు రూ.12,500 కోట్లు భారీ పెట్టుబడి పెట్టాలని ప్రణాళిక రూపొందించింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆటోమొబైల్ మార్కెట్లలో తన ఉనికిని మరింత బలోపేతం చేసుకోవడంతో పాటు.. ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా పెంచడమే లక్ష్యంగా ఈ పెట్టుబడిని మళ్ళిస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది. ప్రస్తుతం అనంతపురం ప్లాంట్లో వార్షికంగా సుమారు మూడు లక్షల యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉండగా.. ఈ కొత్త విస్తరణతో ఆ సంఖ్య ఏకంగా ఐదు లక్షల యూనిట్లకు చేరుకోనుంది.

సరికొత్తగా టార్గెట్..

కంపెనీ ఉత్పత్తి ప్రణాళికలో భాగంగా కొత్త లక్ష్యాన్ని విధించారు. దీని ద్వారా కంపెనీకి మరిన్ని కొత్త మోడల్ లను, వివిధ రకాల పవర్ ట్రైన్ కాంబినేషన్లను మార్కెట్లోకి తీసుకొచ్చేందుకు అదనపు వెసులుబాటు లభిస్తుంది. విశాఖలో జరగనున్న ఏపీ ఇన్వెస్టర్ సమ్మిట్ లో ఈ భారీ విస్తరణ ప్రణాళికకు సంబంధించి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ఈ సమ్మిట్ వేదికగా ఏపీ ప్రభుత్వంతో అధికారికంగా అవగాహన ఒప్పందం కుదిరి చాన్స్ ఉంది. కియా విస్తరణ ప్రణాళికలకు అనుగుణంగా రాష్ట్రంలో ఆటోమొబైల్ ఎకో సిస్టం వ్యవస్థను విస్తరించేందుకు ఇప్పటికే మూడు దక్షిణ కొరియా ఆటో విడిభాగాల తయారీ సంస్థలు ఏపీ ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.

డిమాండ్ కు తగ్గట్టు..

ప్రపంచం తో పాటు మనదేశంలో కూడా కియో కార్లకు విపరీతమైన డిమాండ్ పెరుగుతోంది. ఈ డిమాండ్కు అనుగుణంగా ఉత్పత్తి పెంచడమే లక్ష్యంగా పరిశ్రమ యాజమాన్యం పావులు కదుపుతోంది. మార్కెట్ డిమాండ్ కు తగినట్లుగా తమ పోర్ట్ఫోలియోను నిరంతరం విస్తరిస్తున్నామని.. కస్టమర్ల అంచనాలకు తగ్గట్టుగా విభిన్న సిగ్మెంట్ల లో సరైన ఎంపికలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని కియా ఇండియా తెలిపింది. ఏపీ ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో ఆటోమొబైల్ రంగానికి ఈ పెట్టుబడి ఒక మైలురాయిగా నిలవనుంది. వేలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.ఖ

కాంగ్రెస్ దీపావళి స్కెచ్!



క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ ల అమలు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే అమలు విషయంలో అనేక రకాల విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకంపై క్షేత్రస్థాయిలో ఉన్న ప్రచార లోపాన్ని అధిగమించేందుకు.. రేవంత్ రెడ్డి మంత్రివర్గం సరికొత్త రాజకీయ వ్యూహాన్ని తెరపైకి తెచ్చింది. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి పేరుతో.. ఒక వినూత్న ప్రజా సంబంధాల కార్యక్రమాన్ని నిర్వహించాలని క్యాబినెట్ అధికారికంగా నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే ఏకంగా 2.25 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని.. పండుగ వేళ ఆ ఇళ్లల్లోని ప్రభుత్వం తరుపున వేడుకలు జరపాలని నిర్ణయించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో కలిసి పండుగ జరుపుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో ఒక సానుకూల వాతావరణాన్ని సృష్టించాలన్నది సర్కార్ ప్రధాన ఉద్దేశం.

పథకాల విషయంలో ప్రచారం తక్కువ..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతోంది. సంక్షేమ పథకాల విషయంలో ఆశించిన స్థాయిలో ప్రచారం జరగడం లేదు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల విషయంలో విపక్షాలు చేస్తున్న విమర్శలు, ప్రజాక్షేత్రంలో ఉన్న భావనలు ప్రభుత్వాన్ని కొంత డిఫెన్స్ లో నెట్టాయి. అసలు రాష్ట్రంలో ఒక పేదవాడికైనా ఇల్లు మంజూరు అయిందా? లబ్ధిదారుల ఖాతాల్లోకి నయా పైసా అయినా జమ అయిందా? అనే సందేహాలు సామాన్య ప్రజల్లో కూడా బలంగా నాటుకుపోయాయి. క్షేత్రస్థాయిలో వేలాదిమంది నిర్మాణాలు చేపట్టి బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారన్న విపక్షాల ప్రచారం హోరెత్తుతోంది. ప్రభుత్వం తమ శాఖా పరమైన ప్రగతిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో దారుణంగా విఫలమైందన్న విమర్శలు సొంత పార్టీ నుంచి వినిపిస్తున్నాయి.

గణాంకాలతో సహా వివరణ..

విపక్షాలు చేస్తున్న విమర్శల నేపథ్యంలో ప్రభుత్వం దీనిపై వివరణ ఇచ్చింది. దాదాపు 2.25 లక్షల ఇళ్ళను పూర్తిస్థాయి నిర్మాణానికి తీసుకువచ్చామని ప్రభుత్వం ఇప్పుడు అధికారిక గణాంకాలతో ముందుకొచ్చింది. ఎంత పని చేసినా దాన్ని మార్కెటింగ్ చేసుకో లేకపోతే రాజకీయంగా శూన్యమే మిగులుతుందన్న చేదు నిజాన్ని ఆలస్యంగా గ్రహించింది తెలంగాణ ప్రభుత్వం. అందుకే దీపావళి పండుగను తమ విజయాలను ప్రదర్శించే వేదికగా మార్చుకోవాలని నిర్ణయించింది. ఎల్ల నిర్మాణాలు పూర్తి కాలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన మాట తప్పిందని చేస్తున్న ప్రచారానికి చెక్ పెట్టాలంటే.. పూర్తయిన రెండున్నర లక్షల ఇళ్ల ముంగిట స్వయంగా దీపాలు వెలిగించి చూపించడమే సరైన సమాధానమని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. పండుగ సంబరాల ముసుగులో విపక్షాల నోళ్లు ముగించేందుకు ఇదొక వ్యూహాత్మక అస్త్రంగా మారింది. అయితే ఇది కాంగ్రెస్ పార్టీకి కలిసి వస్తుందని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.

అమెరికా అధ్యక్షు రేసు నుంచి వివేక్ రామస్వామి ఔట్!



(మొదటి పేజీ తరువాయి)

అదే సమయంలో భవిష్యత్తులో రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న భారతీయ సంతతికి చెందిన వివేక్ రామస్వామి ఓహియో గవర్నర్ ఎన్నికల్లో పరాభవం ఎదురయింది. 2026 మిడ్ టర్మ్ ఎన్నికల్లో గవర్నర్ పీఠం కోసం రిపబ్లిక్ అండ్ పార్టీ తరపున పోటీ చేసిన ఆయన.. డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి అమీ యాక్టన్ చేతిలో ఓడిపోయారు. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కు అత్యంత సన్నిహితుడుగా, ఆయన మాగా విధానాలకు ప్రతినిధిగా ప్రచారం సాగించిన వివేక్ ఓడిపోవడం రిపబ్లిక్ కన్సర్వేటివ్ లను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

పడిపోయిన ట్రంప్ గ్రాఫ్..

స్వింగ్ స్టేట్ గా గుర్తింపు సాధించింది ఒహియో. అక్కడ వివేక్ రామస్వామి ఓటమికి ప్రధానంగా డోనాల్డ్ ట్రంప్ జాతీయ స్థాయి ప్రజాదరణ పడిపోవడమే కారణం అని భావిస్తున్నారు. వాస్తవానికి వివేక్ రామస్వామి అమెరికా రాజకీయాల్లో సంచలన నాయకుడిగా ఎదిగారు. కానీ దేశంలో తీవ్ర ద్రవ్యోల్బణం, ట్రంప్ తీవ్రవాద వ్యాఖ్యలు, ఏకపక్ష నిర్ణయాల పట్ల విసుగు చెందిన ఓటర్లు రిపబ్లిక్ కన్ల వైపు మొగ్గు చూపలేదు. వివేక్ రామస్వామి కూడా వ్యాపారవేత్తగా ఉన్న ఇమేజ్తో కాకుండా పూర్తిగా ట్రంప్ నీడలోనే ప్రచారం నిర్వహించడం, స్థానిక ఓహియో సమస్యల కంటే జాతీయస్థాయి వివాదాస్పద అంశాలపై ఎక్కువ దృష్టి పెట్టడం ఆయన విజయ అవకాశాలను దెబ్బతీసింది.

అనేక సందేహాలు..

గవర్నర్గా ఓటమితో అసలు వివేక్ రామస్వామి భవిష్యత్తులో అమెరికా అధ్యక్ష రేసులో ఉంటారా? లేదా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. 2024 రిపబ్లిక్ ఆన్ అధ్యక్ష ప్రైమరీలలో పోటీ చేసి గుర్తింపు పొందారు. 2028 వైట్ హౌస్ రేసులో రిపబ్లిక్ అన్న తరపున ప్రధాన పోటీదారుగా ఉంటారని అంతా భావించారు. అయితే ఇప్పుడు సొంత రాష్ట్రంలోనే గవర్నర్గా గెలవలేని నాయకుడు.. జాతీయస్థాయిలో దేశాధ్యక్షుడిగా ఓట్లు ఎలా సాధించగలడనే బలమైన ప్రతికూల సంకేతం రిపబ్లికన్ ఓటర్లు, విరాళాలు ఇచ్చే దోనర్లలోకి వెళ్లిపోయింది. ఈ ఓటమితో వివేక్ రామస్వామి అధ్యక్ష కలకు దాదాపు బ్రేక్ పడినట్టే.

తీవ్ర నైరాశ్యంలో వైసిపి!

(మొదటి పేజీ తరువాయి)

మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీ పరిస్థితిని తెలియజేస్తున్నాయి. చంద్రబాబు కొడితే ఆ దెబ్బ పోస్టుమార్టం లో కూడా కనిపించదు అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను సైతం విస్మయానికి గురిచేసాయి. చంద్రబాబు రాజకీయ వ్యూహాలను, ఎత్తుగడలను తప్పుపడుతూ నిందించాలనే తాపత్రయంలో అంబటి మాట్లాడినప్పటికీ.. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో కూటమి వరుసగా సాధిస్తున్న ఫలితాలతోనే ఈ కామెంట్స్ చేసినట్లు అర్థం అవుతుంది.

ఉక్కిరి బిక్కిరి..

స్థానిక సంస్థల ఎన్నికల్లో వరుస ఫలితాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. జగన్మోహన్ రెడ్డి ఏకగ్రీవాలు వద్దు అంటే.. ఆయన సొంత ప్రాంతంలోనే విపరీతంగా జరిగాయి. ఆపై కడప జిల్లాలోనే కూటమి ప్రభంజనం సృష్టించింది. సొంత నియోజకవర్గ పులివెందులలో సైతం టిడిపి అద్భుత విజయం అందుకుంది. మున్సిపల్ ఎన్నికల ఫలితాల ప్రభావం ప్రాదేశిక ఎన్నికలపై స్పష్టంగా కనిపించింది. రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లా పరిషత్తు స్థానాలను సైతం తెలుగుదేశం కూటమి సునాయాసంగా దక్కించుకునే పరిస్థితి ఉంది. ఈ పరిణామాల క్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆందోళనతో ఉంది.

అంబటి రాంబాబు కీలక వ్యాఖ్యలు..

సందట్లో సడే మియా అన్నట్టు మీడియా ముందుకు వచ్చి మాట్లాడిన మాజీ మంత్రి అంబటి రాంబాబు నోటి నుంచి చంద్రబాబు కొడితే అలా ఉంటుంది అనే మాట ప్రజల్లోకి బలంగా వెళ్తోంది. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితం చేసి ప్రజలు ఇచ్చిన షాక్ నుంచి తేరుకోక ముందే.. మున్సిపల్ ఎన్నికల్లోనూ పట్టణ ఓటర్లు కూటమికి పట్టం కట్టి ఫ్యాన్ పార్టీని ఊడ్చి పడేసారు. అటు క్షేత్రస్థాయిలో బ్యాలెట్ ముగిసి.. పరిషత్ ఎన్నికల్లో పోలింగ్ సరళి చూస్తుంటే కూటమికి ఏకపక్ష విజయం ఖాయమని స్పష్టత వచ్చింది. అందుకే అంబటి రాంబాబు లాంటి నేతలు కూడా చంద్రబాబుకు ఎలివేషన్ ఇచ్చేలా మాట్లాడుతున్నారు. ప్రస్తుతం ఇదే సోషల్ మీడియాలో ట్రెండింగ్ అంశంగా మారిపోయింది.

సీనియర్లలో భయం..

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి పరంపర కొనసాగే ఛాన్స్ కనిపిస్తోంది. ప్రధానంగా పంచాయితీ ఎన్నికలు కూడా ఏకపక్షంగా జరగనున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్లలో కూడా అదే భయం కనిపిస్తోంది. ప్రత్యర్థులను శారీరకంగా హింసించడం, కేసులు పెట్టడం, రచ్చ చేయడం లాంటి పాత తరహా రాజకీయాలకు భిన్నంగా.. సంక్షేమం, సమర్థ పాలన, మైక్రో లెవెల్ ఎన్నికల మేనేజ్మెంట్ తో చంద్రబాబు వేసే దెబ్బలు పార్టీ అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నాయని వైసీపీ నేతలు గ్రహించారు. అందుకే ఆ దెబ్బ ఎంత బలంగా తగిలిందో చెప్పుకోలేక.. బయటకు ఎలా గాయమైందో చూపించుకోలేక పోస్టుమార్టం లో కూడా కనిపించదు అంటూ ఒక రకమైన నిస్సహాయతతో కూడిన నిజాన్ని అంబటి రాంబాబు బయట పెట్టేశారు.

రామచంద్ర రావుది గొప్ప సాహసమే!

కనిపిస్తోంది. మరోవైపు బిజెపి హై కమాండ్ సైతం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్నగర్ జిల్లాల పట్టభద్రుల శాసనమండలి స్థానం నుంచి మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు గట్టి ప్రయత్నాల్లో ఉన్నారు. గతంలో ఇదే స్థానం నుంచి ఆయన ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవం ఉంది. అందుకే తనకు మరోసారి ఛాన్స్ ఇవ్వాలని ఆయన కోరుతున్నారు. అదే సమయంలో కొందరు యువనేతలు, ఆశావహులు ఈ టిక్కెట్ కోసం తీవ్రంగా పోటీపడుతున్నారు. ఇటువంటి సమయంలో తాను నేరుగా బరిలోకి దిగాలని రామచంద్రరావు ప్రయత్నిస్తుండడం హాట్ టాపిక్ అవుతోంది.

ఒకసారి మూడో స్థానానికి..

మరోవైపు ఈ పట్టభద్రుల స్థానం నుంచి ఏకంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బరిలో దిగుతుండడం చూస్తుంటే రిస్కు చేస్తున్నారేమో అని విశ్లేషకులు భావిస్తున్నారు. విద్యావంతులు, ఉద్యోగులు, మేధావి వర్గం అధికంగా ఉండే ఈ నియోజకవర్గంలో పార్టీ ప్రతిష్టను నిలబెట్టేందుకు తానే సరైన అభ్యర్థి నన్న ధీమాతో ఆయన పావులు కదుపుతున్నారు. అయితే గతంలో ఈ స్థానంలో ఒకసారి ఓడిపోయిన చరిత్ర ఉంది. అదే సమయంలో సంచలన విజయం సైతం దక్కించుకున్నారు. కానీ ఒకసారి మాత్రం ఏకంగా మూడో స్థానానికి పడిపోయారు. ఇటువంటి భిన్న ఫలితాలు చూసిన ఆయన.. ఇప్పుడున్న రాజకీయ సమీకరణలో మళ్లీ అక్కడి నుంచే పోటీకి దిగడం ఒకరకంగా పెద్ద రిస్కు అని చెప్పవచ్చు.

ప్రభుత్వ వ్యతిరేకత పై నమ్మకం..

ఓటమి చేదు జ్ఞాపకాలు వెంటాడుతున్నా.. ఈసారి విద్యావంతుల నాడి ప్రభుత్వ వ్యతిరేకత వైపు ఉందన్న అంచనాతో ఆయన బరిలోకి దిగేందుకు మొగ్గు చూపుతున్నారు. అయితే రామచంద్రరావు వ్యూహం వేరేలా ఉంది. రాష్ట్ర బిజెపి పగ్గాలు ఆయన చేతికి అనూహ్యంగా వచ్చాయి. ఎన్నికల ముంగిట కచ్చితంగా ఆయన మార్పు ఉంటుంది. దానిని అంచనా వేసుకుని క్షేత్రస్థాయిలో ప్రజల ద్వారా ఎన్నికైన ప్రజాప్రతినిధిగా తన బలాన్ని నిరూపించుకోవాలన్నది ఆయన వ్యూహంగా అర్థం అవుతుంది. అధ్యక్ష పదవి బాధ్యతల్లో ఉంటూనే ప్రత్యక్ష ఎన్నికల రణక్షేత్రంలోకి దిగాలన్న ఆయన ఆలోచన పార్టీ శ్రేణులను సైతం విస్మయ పరుస్తోంది.

తేడా కొడితే అంతే..

బిజెపిలో చాలామంది యువనేతలు ఉన్నారు. వారంతా ఆశావహులుగా ఉండగా.. రామచంద్రరావు మాత్రం ఎంత మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఒకవేళ బరిలోకి దిగి విజయం సాధిస్తే పార్టీ పై ఆయన పట్టు మరింత బలపడుతుంది. అదే సమయంలో ఫలితం తేడా కొడితే మాత్రం పార్టీ నాయకత్వ స్థానంలో ఆయన భవిష్యత్తుకే పెద్ద ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది. ఈ పరిణామాలన్నింటినీ బేరీజు వేసుకుంటూనే.. తనకున్న న్యాయవాద, విద్యావేత్తల నేపథ్యాన్ని నమ్ముకుని ఆయన ఎన్నికల బరిలోకి అడుగుపెడుతున్నారు. రామచంద్రరావు మాత్రం గొప్ప రిస్క్ తీసుకుంటున్నారు అనేది విశ్లేషకులు మాట. మరి ఫలితం ఎలా ఉండబోతుందో చూడాలి.

తెలంగాణలో కొత్త ల్యాండ్ పూలింగ్!



ఇచ్చి వదిలేయకుండా.. వారు కోల్పోయిన భూమిని పటిష్టంగా అభివృద్ధి చేసి అందులో మెరుగైన ప్లాట్లను తిరిగి కేటాయిస్తారు. గుజరాత్, మహారాష్ట్ర మోడల్ ఆధారంగా ప్రతిపాదించిన ఈ చట్టంలో.. సేకరించిన ఎకరం భూమికి గాను సుమారు 600 నుంచి 1000 చదరపు గజాల మేర డెవలప్ చేసిన నివాస లేదా వాణిజ్య ప్లాట్లను రైతులకు ఇవ్వనున్నారు. ప్రాజెక్టు పూర్తయ్యాక భూమి విలువ భారీగా పెరుగుతుంది కాబట్టి నష్టపరిహారం కంటే ఈ అభివృద్ధి చెందిన ప్లాట్ ల వల్ల.. రైతులకు సుదీర్ఘకాలంలో అధిక ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందనేది ప్రభుత్వ అంచనా.

నిబంధనల అమల్లో పక్కాగా..

హెచ్ఎండిఏ పరిధిలోని ఉప్పల్ భగాయత్ వంటి కొన్నిచోట్ల కేవలం ప్రభుత్వ ఉత్తర్వులు ఆధారంగానే ల్యాండ్ పూలింగ్ చేపట్టారు గతంలో. అయితే స్పష్టమైన చట్టబద్ధత లేకపోవడంతో.. నిబంధనల అమలులో అనేక వ్యత్యాసాలు రావడం, ప్లాట్ల కేటాయింపులు ఆలస్యం కావడం వంటి ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రస్తుతం రాబోతున్న ప్రత్యేక శాసనంతో ల్యాండ్ రీ కాన్ఫిగ్యూషన్ ఆఫీస్, సాంకేతిక కమిటీలు, ఆపిల్ బోర్డు వంటి చట్టబద్ధమైన వ్యవస్థలు అందుబాటులోకి వస్తాయి. ఇది భూ సమీకరణ ప్రక్రియకు సమగ్ర రక్షణ కల్పించడంతోపాటు పారదర్శకతను, కాల పరిమితితో కూడిన ప్లాట్ల కేటాయింపును హామీ ఇస్తుంది.

గేమ్ చేంజర్

ప్రధానంగా 340 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న రీజనల్ రింగ్ రోడ్ కారిడార్ పొడువున పారిశ్రామిక క్లస్టర్లు, లాజిస్టిక్స్ పార్కులు, భవిష్యత్తు ఫ్యూచర్ సిటీ ప్రాంతాల్లో ఈ పాలసీ గేమ్ చేంజర్ గా మారనుంది. ఒకవైపు ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం పడే అదనపు ఆర్థిక భారం గణనీయంగా తగ్గడమే కాకుండా.. మరోవైపు ప్రాజెక్టు ప్రాంత పరిసర రైతులకు సైతం ఆస్తి విలువ పెరిగి.. ఆర్థిక స్థిరత్వం లభించనుంది. చట్టబద్ధమైన గ్యారెంటీ ఉండడం వల్ల వివాదాలు తగ్గడంతో పాటు తెలంగాణ అంతటా రవాణా, ఇన్ఫ్రా నిర్మాణాలు నిరంతరాయంగా ముందుకు సాగుతాయని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.

తెలంగాణలో కొత్త పథకం!



(మొదటి పేజీ తరువాయి)

సిద్ధం చేసింది. నవంబర్ 20 నుంచి 30 వరకు రాష్ట్రంలోని ప్రతి గ్రామం, ఆవాసంలో ఇందిరమ్మ కమిటీలు ఇంటింటికి వెళ్లి దరఖాస్తులు సేకరించనున్నాయి. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మండలాల్లో తహసిల్దార్లు ఈ దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన బాధ్యతలను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. లబ్ధిదారుల నమోదులో ఎలాంటి సాంకేతిక అవరోధాలు ఎదుర్కాకుండా డిజిటల్ డేటా బేస్ ను రూపొందించి.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అర్హులైన ప్రతి కుటుంబానికి ఐదు లక్షల రూపాయల బీమా పరిధిని వర్తింపజేసేలా సర్కారు మార్గదర్శకాలను విడుదల చేసింది.

ఆ విమర్శలతో..

కెసిఆర్ ప్రభుత్వ హయాంలో అమలైన రైతు బీమా పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పక్కన పెట్టింది అన్న విమర్శలు ఉన్నాయి. ఇవి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇబ్బందుల్లో తెచ్చిపెట్టాయి. అన్నదాతలు ఆకస్మికంగా మరణించినప్పుడు రైతు కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడం.. రైతు బీమా నిలిచిపోవడంపై పల్లెల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. దానిని గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కేవలం రైతులకు మాత్రమే పరిమితం కాకుండా సమాజంలోని అన్ని వర్గాల కుటుంబాలను కలుపుకుంటూ.. అంతకంటే విస్తృత పరిధిలో ఇందిరమ్మ జీవిత బీమా పేరిట ఈ పథకానికి శ్రీకారం చుడుతోంది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ ప్రతిష్టను తిరిగి నిలబెట్టుకునే దిశగా కీలక అడుగుగా ఇది కనిపిస్తోంది. రాజకీయాలకు అతీతంగా ఈ పథకాన్ని అమలు చేయగలిగితే పొలిటికల్ మైలేజ్ వచ్చే అవకాశం ఉంది. ప్రాణ రక్షణ, కుటుంబ భద్రతతో ముడిపడి ఉన్న ఇలాంటి సున్నితమైన పథకం ఏ ఒక్క రాజకీయ పార్టీకో.. వర్గానికి పరిమితం కాకుండా.. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి అందాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గ్రామస్థాయిలో ఏర్పాటు అయ్యే ఇందిరమ్మ కమిటీలు పక్షపాతానికి తావు లేకుండా.. నిస్పాక్షికంగా దరఖాస్తులను ఆమోదించి.. నిజమైన లబ్ధిదారులకు క్లెయిమ్లు సత్వరమే అందేలా పారదర్శక వ్యవస్థ నిర్మించాల్సి ఉంటుంది. ఈ పథకం క్షేత్రస్థాయిలో ఎంత వేగంగా, వివాద రహితంగా అమలయితే.. ప్రభుత్వానికి అంతటి ప్రజాధరణ, సుపరిపాలన గుర్తింపు దక్కడం ఖాయం.

అటు పనులు..... ఇటు పగుళ్ళు...!

సీసీ రోడ్డు నాణ్యతపై పర్యవేక్షణ కరువు.

నాసిరకం పనులపై గ్రామస్తుల ఆగ్రహం.



క్రైమ్ మిర్రర్,మంగపేట: మండలంలోని అకినేపల్లి మల్లారం గ్రామంలో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు మూన్నాళ్ళ ముచ్చటగా మారాయి.రోడ్డు నిర్మాణం పూర్తిగా పూర్తి కాకముందే పలుచోట్ల పగుళ్ళు కనిపిస్తున్నాయి. నాసిరకం పనుల వల్ల సీసీ రోడ్డు దెబ్బతింటుందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఏళ్ల తరబడి ప్రజలకు ఉపయోగపడాల్సిన రోడ్డును కాంట్రాక్టర్ తీవ్ర నిర్లక్ష్యంతో నాసిరకంగా నిర్మిస్తున్నారని కాంట్రాక్టర్ పని తీరు పై స్థానికులు మండిపడుతున్నారు. పనుల నిర్మాణంలో సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం,రోడ్డుకు వాటర్ క్యూరింగ్ చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని వారు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కాంట్రాక్టర్ తమ ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.పూర్తి రోడ్డు నిర్మాణం కాకుండానే పగుళ్ళు రావడంతో మొత్తం పూర్తి అయ్యేవరకు రోడ్డు ఉంటుందో లేదో అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి.అకినేపల్లి మల్లారంలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులపై ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు స్థానికంగా పరిశీలన జరిపి, పనులు నాణ్యతగా మొత్తం నిర్మాణం చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజాధనం వృథా కాకుండా నాణ్యతా ప్రమాణాల ప్రకారం పనులు పూర్తయ్యేలా పంచాయతీ రాజ్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మైనార్టీ సంక్షేమానికి కొత్త అడుగులు..

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్, నవంబరు : విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో ఎదురు చూస్తున్న మైనార్టీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఇప్పట వరకు అమలవుతున్న ఓవర్సీస్ స్కాలర్షిప్ పథకంలో ఈజిప్ట్, సౌదీ అరేబియాలను కూడా చేర్చినట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. దీంతో ఆయా దేశాల్లో చదువుకోవాలనుకునే విద్యార్థులకు కూడా ఈ పథకం ద్వారా ప్రయోజనం కలగనుంది. విద్యార్థులకు మరిన్ని అవకాశాలు కల్పించడంతో పాటు మైనార్టీ వర్గాల సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఆయన వెల్లడించారు.శుక్రవారం ప్రజాభవన్లో మంత్రి అజారుద్దీన్తో కలిసి భట్టి విక్రమార్క పలు సంక్షేమ పథకాల అమలుపై అధికారులతో సమీక్షించారు. షాదీ ముబారక్, ప్రీ-మెట్రిక్ స్కాలర్షిప్ల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా పెండింగ్లో ఉన్న అంశాలను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అర్హత ఉన్నవారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

పోటీ పరీక్షల శిక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు

మైనార్టీ యువతకు విద్య, ఉద్యోగ అవకాశాలు పెంచే దిశగా స్టడీ సర్కిళ్ల ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు. నాంపల్లిలోని హజ్హౌస్ సమీపంలో మధ్యలో నిలిచిపోయిన భవన నిర్మాణాన్ని తిరిగి వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఈ ప్రాజెక్టు కోసం రూ. 25 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత అందులో మైనార్టీ స్టడీ సర్కిల్తో పాటు సంక్షేమ శాఖకు సంబంధించిన కార్యాలయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇదే తరహాలో మొఘల్పురా, బండ్లగూడ ప్రాంతాల్లో మరో రెండు స్టడీ సర్కిళ్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వీటి ద్వారా మైనార్టీ విద్యార్థులకు పోటీ పరీక్షల శిక్షణ, విద్యాపరమైన మార్గదర్శకత్వం అందించేందుకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది.

విద్యాసంస్థల బకాయిలపై ప్రత్యేక దృష్టి

మైనార్టీ విద్యాసంస్థలకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు నిలిచిపోకుండా చూడాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. నిధుల విడుదలలో అనవసర జాప్యం లేకుండా ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. అలాగే రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి అందిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు.

క్రైస్తవ మైనార్టీల సమస్యలకూ పరిష్కారం

మైనార్టీ వర్గాల్లోని క్రైస్తవుల సమస్యలపై కూడా ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని డిప్యూటీ సీఎం సూచించారు. వారి నుంచి వచ్చే విజ్ఞప్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఓల్డ్ సిటీ అభివృద్ధి కోసం ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు కేటాయించిందని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క పేర్కొన్నారు. విద్యా అవకాశాల విస్తరణ, సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పనతో మైనార్టీ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని వెల్లడించారు.

రామంతాపురంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు, పొదల తొలగింపు -- కౌన్సిలర్ బండ్ల గూడెం ప్రశాంత్ చొరవ



క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి : శంకర్పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు రామంతాపురంలో కౌన్సిలర్ బండ్ల గూడెం ప్రశాంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డి, ముళ్ల పొదలను పారిశుద్ధ్య సిబ్బందితో తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ వార్డులో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రతి వీధిని శుభ్రంగా ఉంచేందుకు నిరంతరం చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజలు కూడా చెత్తను రోడ్లపై వేయకుండా స్వచ్ఛత కార్యక్రమానికి సహకరించాలని కోరారు. కౌన్సిలర్ చొరవపై వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..ఏదులాపురం మున్సిపాలిటీలో 38 కుటుంబాలకు ఆర్థిక సాయం



ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఏదులాపురం మున్సిపాలిటీలో అక్టోబర్ నెలలో మృతి చెందిన వారి కుటుంబాలకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఒక్కో కుటుంబానికి రూ. 10,000 చొప్పున మొత్తం 38 కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటునిచ్చారు. ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపాలిటీ అధ్యక్షులు బానోత్ కిషోర్ హాజరై బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో పలువురు కౌన్సిలర్లు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ
శనివారం
7-11-2026
3



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో

రాష్ట్ర ఫోటోగ్రాఫర్ల అధ్యక్షుడి పర్యటన

మందమర్రిలో ఫోటో, వీడియో గ్రాఫర్లతో సమావేశం

మందమరి నవంబర్ 6 (క్రైమ్ మిర్రర్): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా తెలంగాణ ఫోటో, వీడియో గ్రాఫర్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కే. హుస్సేన్ శుక్రవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా మందమర్రి పట్టణ ఫోటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కమిటీ సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘంలో సభ్యత్వం పొందిన ప్రతి ఫోటోగ్రాఫర్ సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. సభ్యుల వృత్తిపరమైన అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఫోటో, వీడియో గ్రాఫర్లకు అండగా ఉంటూ వారి అభ్యున్నతికి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్లకొండ కనకయ్య గౌడ్, మందమర్రి పట్టణ అధ్యక్షుడు పసుల వెంకటస్వామి, కోశాధికారి బద్రి సతీష్, ఉపాధ్యక్షులు ఆర్. సుజిత్, నక్క పవన్, లక్కిరెడ్డి అనిధర్, మాజీ ఉపాధ్యక్షుడు విక్టరీ అశోక్, సలహాదారులు నక్క తిరుపతి, కామెర మహేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతరేణి శ్వాస తిరుపతి, కోశాధికారి మూక్కెర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ పదవుల కేటాయింపులో బీసీలకు అన్యాయం: రవి గౌడ్

కల్వకుర్తిలో ఎస్టీలకు ఒక్క పదవి కూడా లేదు.. బీసీలకు ఒకటి, అగ్రవర్ణాలకు మూడు పదవులు ఇచ్చారంటూ విమర్శ

ఎన్నికలు లేకుండా పదవుల కేటాయింపే నిజమైన ఓట్ చోరీ: బీజేపీ ఓబీసీ నేత



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: పీఏసీఎస్ చైర్మన్ పదవుల కేటాయింపులో కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని విస్మరించిందని నాగర్ కర్నూల్ జిల్లా బీజేపీ ఓబీసీ వైస్ ప్రెసిడెంట్ తిరుమణి రవి గౌడ్ విమర్శించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పీఏసీఎస్ చైర్మన్ పదవులు ప్రత్యక్ష ఎన్నికల ద్వారా భర్తీ చేయాల్సి ఉండగా, ఎన్నికలు నిర్వహించకుండా ముఖ్యమంత్రి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తమకు నచ్చిన వారికి పదవులు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధతులకు విరుద్ధంగా పదవుల పంపకాలు చేపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ఎస్టీలకు ఒక్క చైర్మన్ పదవి కూడా కేటాయించలేదని, జనాభాలో అధికంగా ఉన్న బీసీలకు కేవలం ఒక్క పదవి మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. మరోవైపు అగ్రవర్ణాలకు మూడు చైర్మన్ పదవులు కేటాయించడం సామాజిక న్యాయానికి విరుద్ధమని విమర్శించారు. పీఏసీఎస్లు రైతులకు రుణాలు, ఎరువులు, విత్తనాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని, అలాంటి సంస్థల్లో ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత ఇవ్వకుండా పదవులను భర్తీ చేయడం రైతుల ప్రయోజనాలను దెబ్బతీస్తుందని అన్నారు. గ్రామాల్లో రైతులకు సేవ చేసే ప్రతినిధులను ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. బీజేపీపై ఓట్ చోరీ ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, ప్రస్తుతం పదవుల కేటాయింపులో అనుసరిస్తున్న విధానంపై సమాధానం చెప్పాలని రవి గౌడ్ ప్రశ్నించారు. ఓట్లు లేకుండా పదవులను తమకు నచ్చిన వారికి కట్టబెట్టడమే నిజమైన ఓట్ చోరీ అని వ్యాఖ్యానించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, నామినేటెడ్ పదవుల విషయంలోనూ బీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని విమర్శించారు. బీసీలకు జరుగుతున్న అన్యాయంపై బీజేపీ తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రాజకీయ పదవుల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజలు అన్ని అంశాలను పరిశీలించి సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యంపై ప్రశ్నించాలని రవి గౌడ్ కోరారు.

GHMC
hmda
Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
4 | శనివారం | 7-11-2026

రైతుల కన్నీళ్లు కనిపించడం లేదా రేవంత్‌రెడ్డీ?

సోకులకు నిధులున్నాయి.. రైతులకు ఇవ్వడానికి లేవా?

హత్నూరలో ఎండిన పంటలను పరిశీలించి ప్రభుత్వంపై హరీశ్‌రావు ధ్వజం



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 06: రాష్ట్రంలో రైతులు పంటలు ఎండిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దేవునిగుట్ట తండాలో ఎండిపోయిన వరి పంటలను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.మూసీ సుందరీకరణ, ఫ్యూచర్ సిటీ, ఇతర కార్యక్రమాలకు భారీగా నిధులు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి మాత్రం ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. రైతుల కళ్లలో కన్నీళ్లు కనిపించడం లేదా అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నిలదీశారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఏర్పడిన పరిస్థితి అని ఆరోపించారు.రాష్ట్రంలో కరువు మండలాల ప్రకటనలో రాజకీయ వివక్ష చూపుతున్నారని, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. నర్సాపూర్ నియోజకవర్గంలో వేలాది మంది రైతులకు రుణమాఫీ అందలేదని, రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు తక్షణ కరువు సాయం అందించడంతో పాటు రైతు భరోసా నిధులు విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న రుణమాఫీ, పంట బోనస్ చెల్లించాలని కోరారు. పంటల కొనుగోళ్లను వెంటనే ప్రారంభించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగూరు ప్రాజెక్టు నీటి నిర్వహణపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే ప్రజల నుంచి ప్రభుత్వానికి వ్యతిరేకత ఎదురవుతుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గచ్చిబౌలిలో హోటల్ గదిలో అమెరికా దేశస్థుడు మృతి...



క్రైమ్ మిర్రర్ గచ్చిబౌలి: గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్ ఎల్ ఎన్ టెర్మినస్‌లో ఉన్న మారియట్ ఎగ్జిక్యూటివ్ అపార్ట్‌మెంట్స్‌లో అమెరికా దేశస్థుడు మృతి చెందాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడిని కాలిఫోర్నియాకు చెందిన మిచెల్ బ్రియాన్ లీ (41)గా గుర్తించారు. వ్యాపార పనుల నిమిత్తం తన భాగస్వామి డేవిడ్ వుతో కలిసి నవంబర్ 2న హైదరాబాద్‌కు వచ్చి 12వ అంతస్తులోని రూమ్ నంబర్ 1218లో బస చేస్తున్నాడు.నవంబర్ 4 సాయంత్రం నుంచి ఫోన్ కాల్స్‌కు స్పందించకపోవడంతో నవంబర్ 5 సాయంత్రం 6:30 గంటలకు హోటల్ సిబ్బంది గది తలుపు తెరిచి చూడగా మంచంపై అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. 108 అంబులెన్స్ సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు.సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతికి గల ఖచ్చితమైన కారణం పోస్టుమార్టం నివేదిక తర్వాత నిర్ధారణ అవుతుందని పోలీసులు తెలిపారు.


ఖమ్మం గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ యజమానుల సంఘం నూతన కమిటీ



ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: ఖమ్మం గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ యజమానుల సంఘం 2026-2028 సంవత్సరానికి నూతన కమిటీ ఎన్నిక నిన్న ఖమ్మం లో జరిగింది.అధ్యక్షుడు గా కామర్తపు గోపాల్ రావు ఉపాధ్యక్షుడు-I రాకేష్ దొడ్డ ఉపాధ్యక్షుడు-II వెంకట రెడ్డి ఆవుల కార్యదర్శి మాధవ రావు పుచకాయల, జాయింట్ సెక్రెటరీ -1 స్వేధన్ దొండేటి జాయింట్ సెక్రెటరీ -2 వెంకట కృష్ణయ్య ధనల ట్రెజరర్ గా రియాజ్ షేక్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రవికుమార్ పెరుమాళ్ళపల్లి నవీన్ వేముల అనుదీప్ పాటిబండ్ల వెంకట రంగారావు పుల్లారావు గుండ్ల ఎన్నికైనారు. ఈ సాల బాగా నూతన కమిటీని పలువురు అభినందించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించండి

హరీష్ రావును కలిసి విజ్ఞప్తి చేసిన గూడూరు లక్ష్మీ నర్సింహా రెడ్డి



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్): హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మీడియా ప్యానలిస్టు గూడూరు లక్ష్మీ నర్సింహ రెడ్డి పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీష్ రావును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న తన రాజకీయ ప్రస్థానంతో పాటు, గతంలో సర్పంచిగా, తెలంగాణ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవాన్ని హరీష్ రావుకు వివరించారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర మీడియా ప్యానలిస్టుగా పార్టీ విధానాలు, వాణిని ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే పట్టభద్రుల సమస్యలు, నిరుద్యోగ యువత ఇబ్బందులు, విద్యారంగంలో నెలకొన్న సవాళ్లు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై శాసనమండలిలో తన గళాన్ని వినిపిస్తానని పేర్కొన్నారు. పట్టభద్రుల హక్కుల పరిరక్షణ, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు..తన రాజకీయ, సామాజిక అనుభవాన్ని గుర్తించి ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని పార్టీ నాయకత్వాన్ని కోరారు. దీనిపై హరీష్ రావు సానుకూలంగా స్పందిస్తూ, పార్టీలో చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని తెలిపినట్లు లక్ష్మీ నర్సింహ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశని మహేష్, పార్టీ సీనియర్ నాయకులు కంబాల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేటలో సురక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం




ఆసుపత్రిని ప్రారంభించిన నిర్మల జగ్గారెడ్డి



సదాశివపేట, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 06: పట్టణంలోని ప్రధాన రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన సురక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఘనంగా ప్రారంభమైంది. మాజీ టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఆసుపత్రిని ప్రారంభించారు. డాక్టర్లు శిరీష, రాజ్ కుమార్ పట్లోళ్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రిలో చెవి, ముక్కు, గొంతు సంబంధిత వ్యాధులకు ప్రత్యేక వైద్య సేవలతో పాటు డయాబెటిస్ చికిత్స, అన్ని రకాల వైద్య సేవలను అత్యాధునిక సదుపాయాలతో అందించనున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు మాట్లాడుతూ.. సదాశివపేట పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మునిపల్లి సత్యనారాయణ, వైస్ చైర్మన్ చిరు, సర్పంచ్ మధు, మిల్గిరిపేట సర్పంచ్ షాబుద్దీన్, దుర్గారెడ్డి, కుమార్, పట్టణ ప్రముఖులు, శ్రేయోభిలాషులు, ఆసుపత్రి వైద్య బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల వైద్య సేవలకు కేంద్ర బృందం ప్రశంసలు!

వ్యాధుల నియంత్రణ, ప్రజారోగ్య పరిరక్షణ చర్యలపై డాక్టర్ శ్యామ్ జాన్ సంతృప్తి



మంచిర్యాల, నవంబర్ 6 (క్రైమ్ మిర్రర్) : ప్రజారోగ్య పరిరక్షణతోపాటు ప్రాణాంతక వ్యాధుల నివారణకు మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ చేపడుతున్న చర్యలను కేంద్ర ప్రభుత్వ వ్యాధి నియంత్రణ జాతీయ కేంద్రం (ఎన్‌సీడీసీ) పరిశీలకుడు డాక్టర్ శ్యామ్ జాన్ ప్రశంసించారు. జిల్లాలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వ్యాధుల నియంత్రణ కార్యక్రమాల అమలు తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.శుక్రవారం ఆయన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని సందర్శించి, డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్‌తో కలిసి వ్యాధుల నివారణకు చేపడుతున్న చర్యలపై సమీక్షించారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని వివిధ వార్డులు, మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఆర్ఎంవో డాక్టర్ శ్రీధర్, ఉప డీఎంహెచ్ఓ డాక్టర్ సుధాకర్ నాయక్‌లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోగుల వివరాల నమోదు, మందులు, టీకాల లభ్యత, అత్యవసర వైద్య సేవల నిర్వహణ తీరును పరిశీలించారు.జిల్లాలో చిన్నారులకు 12 రకాల ప్రాణాంతక వ్యాధులు సోకకుండా నూటికి నూరు శాతం టీకాలు అందిస్తున్నట్లు డీఎంహెచ్ఓ వివరించారు. పోలియో, మీజిల్స్, రుబెల్లా, డిఫ్తీరియా తదితర వ్యాధులపై నిరంతర నిఘా ఉంచుతున్నామని, ప్రైవేటు శిశు వైద్య నిపుణులతో ప్రతి రెండు నెలలకోసారి సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వ్యాప్తిని అరికట్టేందుకు పంచాయతీలు, పురపాలక సంఘాల సహకారంతో పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ డయాగ్నస్టిక్స్ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు, అవసరమైన రక్త నమూనాలను హైదరాబాద్‌లోని ప్రయోగశాలలకు పంపిస్తున్నట్లు వివరించారు. 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ఇంటింటికీ వెళ్లి నిర్వహిస్తున్నామని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి ఉచితంగా మందులు అందించడంతోపాటు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కుక్క, పాముకాటు బాధితులకు తక్షణ వైద్యం అందించేందుకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో అవసరమైన టీకాలను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనిల్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్లు, అల్లాడి శ్రీనివాస్, రషీద్, సీహెచ్ఓలు పుట్ట సత్తయ్య, నాందేవ్, వెంకటేశ్వర్లు, ఎపిడెమాలజిస్ట్ సుమన్, పీహెచ్ఎన్ పద్మ, ఇతర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాడుగుల మండలంలో విషాదం

కారులోనే నిప్పంటించుకొని వ్యక్తి ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులే కారణమా? పోలీసుల దర్యాప్తు



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (మాడుగుల):కారుపై పెట్రోల్ పోసి, తనపై కూడా పెట్రోల్ పోసుకొని కారులో ఉండగానే నిప్పంటించుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన రంగారెడ్డి జిల్లా మాడుగుల మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మాడుగుల మండలం ఫకీర తండాకు చెందిన సంతోష్ (35) హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తన స్వగ్రామమైన వాల్య తండాకు వచ్చిన సంతోష్, గ్రామ సమీపంలోని బావి వద్ద కారును నిలిపి దానిపై పెట్రోల్ పోశాడు. అనంతరం తనపై కూడా పెట్రోల్ పోసుకొని కారులో ఉండగానే నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తెల్లవారుజామున ఈ ఘటనను గమనించిన గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంతోష్ ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులే కారణమా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. మృతుడు సంతోష్‌కు భార్యతో పాటు ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తి అకాల మరణంతో భార్యాపిల్లలు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఈ ఘటనతో వాల్య తండాతో పాటు పరిసర ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

మంత్రి వివేక్ చేతుల మీదుగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

భీమారం మండలానికి చెందిన 14 మంది లబ్ధిదారులకు అందజేత



జైపూర్, నవంబర్ 6 (క్రైమ్ మిర్రర్) : భీమారం మండలానికి చెందిన 14 మంది లబ్ధిదారులకు మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. శుక్రవారం జైపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.భీమారం గ్రామపంచాయతీ పరిధికి చెందిన ఉల్లి రవళి, ఎం. దివ్య, ధార వేణి, కమల, కొత్త విజయ, పోడేటి చరిష్మా, భూక్య విజయ తదితర అర్హులకు చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో భీమారం తహసీల్దార్ సదానందం, సర్పంచ్ ఉష్కమల్ల విజయలక్ష్మి, పున్నం చంద్, గ్రామపంచాయతీ అధికారి ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

పాలకులు సిగ్గుపడాలి

సాధించుకున్న తెలంగాణాలో ఇంకా ఆత్మహత్యలు....

హామీలు మరచి ఆస్తులు కూడబెట్టుకుంటున్నారు.

బాధితులను కనీసం పట్టించుకోవడంలేదు

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సోమయ్య



ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ఇంకా ఆత్మ బలిదానాలు ఆగడం లేదంటే పాలకులు సిగ్గుపడాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సోమయ్య అన్నారు. ఇటీవల జనగామా జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన ప్రముఖ తెలంగాణ ఉద్యమకారుడు, పీఏసీఎస్ డైరెక్టర్ వేముల లక్ష్మణ్ గౌడ్ తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకోవడం తమను కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం బాధిత కుటుంబాన్ని పలువురు ఉద్యమకారులతో వెళ్లి పరామర్శించారు. అనంతరం బత్తుల సోమయ్య మాట్లాడుతూ... విద్యార్థులు, మేధావులు, సామాన్యులు సైతం ప్రత్యేక తెలంగాణ కోసం అనేక త్యాగాలు చేశారని.., మన నీళ్లు, మన నిధులు, మన నియామకాలు మనకే దక్కాలనే ఏకైక లక్ష్యంతో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుంటే ఆ ఫలాలు కొద్ది మందే అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమంకోసం సర్వం కోల్పోయిన అనేకులు పన్నెండేళ్ల పాటు ఎదురు చూసినప్పటికీ ఎలాంటి ఫలితంలేకపోవడంతో నిరాశ చెంది.., చేసిన అప్పులు తీర్చుకోలేక ఇలా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు అని సోమయ్య అన్నారు. గత పాలకులకు గానీ నేటి పాలకులకు గానీ చీమ కుట్టినట్టు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ జాతిపిత అని చెప్పుకుంటున్న పెద్దమనిషి కెసిఆర్, కానీ ఆత్మహత్య లకు ఉసిగొల్పిన హరీష్ రావు గాని, హోటళ్ళు, ఫార్మహౌస్ లు కట్టుకుని ఊరేగుతున్న కేటీఆర్ కే ఈ ఆత్మహత్యల పాపం తగలక మానదని అన్నారు. వీళ్ళు పదేళ్లలో ఉద్యమకారులకు చేసిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియంత పాలనను తరిమి కొట్టి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అయినా న్యాయం చేస్తుందని భావించి కాంగ్రెస్ కు పట్టంగడితే వాళ్లుకూడా అదే బాటలో పయనిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణ ధనాన్ని కాళేశ్వరం పేరుతో దోచుకుంటే నేడు రేవంత్ రెడ్డి కూడా తన స్వ లాభం కోసం కుటుంబ ఆస్తులను పెంచుకుంటున్నాడని బత్తుల అన్నారు. మూసీ సుందరీకరణ, ఫ్యూచర్ సిటీ, అందాల పోటీల పేరుతో లక్షల కోట్ల రూపాయలను కాజేస్తున్నారని ఆరోపించారు. ఈ చావులకు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, రేవంత్ రెడ్డిలే బాధ్యత వహించాలని అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేకుంటే 2024లో కేసీఆర్ కు పట్టిన గతే రేవంత్ రెడ్డికి కూడా పడుతుందని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలకు ఉద్యమాలు కొత్తేమి కాదని రానున్న రోజుల్లో అన్ని సంఘాలను కలుపుకుని ప్రత్యేక కార్యాచరణను ప్రకటిస్తామని, మరో ఉద్యమానికి తెరలేపక ముందే ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించి వారి కుటుంబాలను ఆదుకోవాలని ఈ సందర్భంగా సోమయ్య నేటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

లక్ష్మణ్ గౌడ్ కు ఘన నివాళి

ఆత్మహత్య కు పాల్పడిన లక్ష్మణ్ గౌడ్ చిత్రపటానికి ఎంమ్మెల్సీ కోదండరాం, రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి తో కలసి బత్తుల సోమయ్య, తెలంగాణ ఉద్యమకారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం : వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించెందుకు ఖమ్మం జిల్లా నుంచి వెళ్లిన తెలంగాణ ఉద్యమకారులు బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. రానున్నారోజుల్లో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీ యు జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఓరుగంటి ఆనంద్, రాష్ట్ర ప్రధాన కారదర్శి కొణతం యాదగిరి రెడ్డి, తెలంగాణ ఉద్యమకారులు కుక్క సత్యం, అంగిడి బిక్షం, తునికిపాటి లక్ష్మణ చారి, బొలికొండ పాపయ్య, పొలాస సోమయ్య, గడ్డం యాదగిరి, వడ్త్యా రాజేష్ నాయక్, కాశబోయన యాకయ్య, గుగులోత్ మంగీలాల్, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామగుండం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్


పోలీస్ స్టేషన్ల నిర్వహణలో క్రమశిక్షణ,నేర నియంత్రణలో నిరంతర నిఘా తప్పనిసరి: పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

పెద్దపల్లి జిల్లా క్రైమ్ మిర్రర్ న్యూస్ నవంబర్ 6 న్యూస్ : పోలీస్ స్టేషన్లను పరిశుభ్రంగా, క్రమబద్ధంగా నిర్వహించడంతో పాటు నేర నియంత్రణపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, ఐపీఎస్., అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రామగుండం పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఐ హరి శేఖర్‌తో మాట్లాడి ఆన్‌లైన్‌లో కేసుల నమోదు, ఈ-సాక్ష్య, ఈ-సమన్ల అమలు, అండర్ ఇన్వెస్టిగేషన్ (యు ఐ) కేసులు, పెండింగ్‌లో ఉన్న పాత కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంచడంతో పాటు వారిని క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన అన్ని రికార్డులు,రిజిస్టర్లను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్ పరిశు



భ్రతకు ప్రాధాన్యతనిస్తూ, కేసులకు సంబంధించిన వాహనాలను క్రమబద్ధంగా భద్రపరచాలని తెలిపారు. రౌడీషీట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సంబంధిత వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. ఎస్‌హెచ్‌ఓలు బ్లూకోల్ట్స్,పెట్రోకార్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఎన్‌డీపీఎస్,ప్రాపర్టీ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు రైల్వే పోలీస్ పరిధిలోని జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ అధికారులతో సమన్వయం కొనసాగించాలని తెలిపారు.రైల్వే స్టేషన్ పరిసరాల్లోని అన్ని ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు అందే ఫిర్యాదులపై చట్టప్రకారం తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన కేసుల్లో ఎలాంటి జాప్యం చేయకుండా కేసులు నమోదు చేసి దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.స్టేషన్ రైటర్లతో సహా ప్రతి పోలీస్ సిబ్బంది తమ విధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పీఎం రాహత్ పథకంపై ముందుగా పోలీస్ సిబ్బందికి, అనంతరం ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి అధికారి, సిబ్బంది పూర్తి బాధ్యతతో పనిచేయాలని సీపీ సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం, రికార్డుల నిర్వహణలో అలసత్వాన్ని ఏమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో రామగుండం సీఐ కృష్ణ కుమార్ పాల్గొన్నారు.



హక్కుల కోసం పోరాటం.. సిఐటియు తోనే సాధ్యం!



వేతన ఒప్పందాల సాధనలో సిఐటియు ముందంజ

ఐఎన్‌టియుసి కూటమిని ఓడించి, కార్మికుల పక్షాన నిలిచే సిఐటియు కు మద్దతివ్వాలి

సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 06: తోషిబా పరిశ్రమ కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న సిఐటియు ను ఎన్నికల్లో గెలిపించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం తోషిబా పరిశ్రమ వద్ద నిర్వహించిన ఎన్నికల గేట్ మీటింగ్‌లో ఆయనతో పాటు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే. మల్లికార్జున్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం నిరంతరం అందుబాటులో ఉంటూ పోరాడుతున్న సంఘం సిఐటియు మాత్రమేనని పేర్కొన్నారు. సిఐటియు ను ఓడించేందుకు ఇతర కార్మిక సంఘాలన్నీ ఏకమవుతున్నాయని, కార్మికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఐఎన్‌టియుసి కూటమిని ఓడించి, కార్మికుల పక్షాన నిలిచే సిఐటియు కు మద్దతుగా నిలవాలని కోరారు. అనంతరం సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే. మల్లికార్జున్ మాట్లాడుతూ.. కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలు సాధించడంలో సిఐటియు ముందంజలో ఉందన్నారు. కార్మికులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. కార్మికుల కోసం త్యాగాలు చేస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకత్వాన్ని గుర్తించి ఎన్నికల్లో చుక్క గుర్తుపై ఓటు వేసి సిఐటియు ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బి. మల్లేష్, కె. రాజయ్య, పాండురంగారెడ్డి, అనంతరావు, పుల్లంరాజు, శ్రీధర్, వీఎస్ రాజు, వేణుగోపాల్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నిరుద్యోగులలో మానసిక స్థైర్యాన్ని నింపేందుకు ఏఐవైఎఫ్ మోడల్ టెస్ట్ ఉపయోగపడుతుంది

ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు, ఖమ్మం టూ టౌన్ సీఐ రామకృష్ణ, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత

ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి మోడల్ ఎస్సై, కానిస్టేబుల్ టెస్ట్ విజయవంతం




ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: నిరుద్యోగులలో ఉన్న ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు, వారిలోని టాలెంట్ ను గుర్తించేందుకు ఏఐవైఎఫ్ మోడల్ టెస్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు, ఖమ్మం టూ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ లో ఉన్న ప్రభుత్వ బీసీ స్టడీ సర్కిల్ లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్సై, కానిస్టేబుల్ మోడల్ టెస్ట్ పేపర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా విచ్చేసిన భాగం హేమంతరావు మాట్లాడుతూ, ఉద్యోగ నోటిఫికేషన్ల విడుదల కోసం ఏఐవైఎఫ్ ఒకవైపు పోరాటాలు చేస్తూనే, మరోవైపు నిరుద్యోగులలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు, పోలీస్ అభ్యర్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు మోడల్ టెస్ట్ లు పెట్టడం అభినందనీయమన్నారు. టూ టౌన్ సీఐ రామకృష్ణ, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై పరీక్షలకు సంసిద్ధం కావడానికి ముందు ఏఐవైఎఫ్ నిర్వహిస్తున్న ఇలాంటి టెస్ట్ లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జాతీయ సమితి సభ్యులు నానబాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి రావి శివరామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇటికల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మనోజ్, ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రవణ్ కుమార్, ఖమ్మం నగర అధ్యక్ష, కార్యదర్శులు దుర్గానాథ్, కృష్ణ ప్రసాద్, ఏఐవైఎఫ్ యంగ్ ఉమెన్ నాయకులు దండి శ్రీజ, బొప్పి ఉమా, కాంపాటి యమున, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు కిరణ్, భీమేష్, షేక్ రఫీ, సాయి, పఠాన్ రఫీ, మెడకంటి అభిరామ్ రెడ్డి, బషీర్ తదితరులు పాల్గొన్నారు. టెస్ట్ కు సహకరించి పాల్గొన్న అభ్యర్థులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

రాజకీయ కక్ష సాధింపు - అక్రమ అరెస్టులను ఆపాలి



క్రైమ్ మిర్రర్, నాంపల్లి: మాజీ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ దూది మెట్ల బాలరాజు పై రాజకీయ కక్ష సాధింపు చర్యకు తెలంగాణ విద్యార్థి ఉద్యమ నేత మాజీ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ అక్రమ అరెస్టును నాంపల్లి మండలం బి ఆర్ఎస్ సీనియర్ నాయకులు బుడిగపాక గోవర్ధన్ తీవ్రంగా ఖండిస్తున్నాము. ఎం ఎల్ సి బల్మూరి వెంకట్ భార్య హిందూజా రెడ్డి పెట్టిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు మీద బాలరాజుని అరెస్టు చేయడం హేమమైన చర్య, రాజకీయ ప్రయోజనాల కోసం కులం అడ్డు పెట్టుకోవడం కాదు, బల్మూరి వెంకట్ మీరు రెడ్డి అమ్మాయిని పెళ్లి చేసుకొని ఎస్సీ అని చెప్పి ఇలాంటి కుల రాజకీయాలు చేయించడం సిగ్గుచేటు, బాలరాజు యాదవ్ తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉన్న వ్యక్తి, ఎస్సీ అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్న బాలరాజు యాదవ్ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడం రాజకీయ కక్ష సాధింపు చర్యకు నిదర్శనం, ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలిపే హక్కును గౌరవించాలి, ఆయనను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాము.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 శనివారం 7-11-2026



సూగురు గ్రామంలో అంగరంగ వైభవంగా గండ దీప స్తంభం పునఃప్రతిష్ఠ

పూర్వీకుల సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఘనంగా ప్రత్యేక పూజలు

వనపర్తి, నవంబర్ 06 క్రైమ్ మిర్రర్: వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం సూగురు గ్రామంలో శుక్రవారం గండ దీప స్తంభం పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.పూర్వీకుల కాలం నుంచి ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఐదు జంటల ఆధ్వర్యంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్ఛారణల మధ్య గండ దీప స్తంభం పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాదమ్మ పరశురాం, వనపర్తి జిల్లా కుమ్మర సంఘం ప్రధాన కార్యదర్శి కె. పరశురాముడు, కుమ్మర సంఘం మండల అధ్యక్షుడు కె. హర్షవర్ధన్, పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్, సేవకుల నందీశ్వర్, కుమ్మరి.సహదేవుడు, ఉప్పరి శ్రీనివాసులు, కుమ్మరి శేఖర్, ఉప్పరి మోహన్, సేవకుల శివరాజు, కుమ్మరి చంద్రశేఖర్, కుమ్మరి వెంకటస్వామి, ఉప్పరి కిషోర్, కుమ్మరి మహేష్. కుమ్మరి రఘువర్ధన్, బెక్యం కురుమూర్తి, సేవకుల ఉపేందర్. ఉప్పరి చంద్రశేఖర్, వెంకట్, కుమ్మరి రాముడు. మేస్త్రి శేఖర్, ఆంజనేయులు. కుమ్మరి కర్ణాకర్, కుమ్మరి యశ్వంత్, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వివేకవర్ధని డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలు

కార్పొరేట్ కళాశాలలకు దీటుగా నాణ్యమైన విద్య: డాక్టర్ చంద్రమోహన్ గౌడ్





మందమర్రి టౌన్ నవంబర్ 06 క్రైమ్ మిర్రర్: మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని అందుగులపేట శ్రీ కన్వెన్షన్‌లో వివేకవర్ధని డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఉదారి చంద్రమోహన్ గౌడ్ హాజరైనారు. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయం 2021--2023 విద్యా సంవత్సరంలో గోల్డ్ మెడల్ సాధించిన కళాశాల విద్యార్థిని నుజాత్ అంజుమ్‌ను కళాశాల అధ్యాపక బృందంతో ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్య అనేది వ్యక్తి జీవితాన్ని మార్చే శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం డిగ్రీలు సాధించడానికే పరిమితం కాకుండా, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేలా తమను తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు. అపజయాలకు భయపడకుండా వాటిని విజయానికి మెట్లుగా భావించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఒక విద్యార్థి సాధించిన విజయం ఆ విద్యార్థికే కాకుండా తల్లిదండ్రులకు, కళాశాలకు, సమాజానికి గర్వకారణమని అన్నారు. నుజాత్ అంజుమ్ సాధించిన గోల్డ్ మెడల్ మరెంతోమంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమ ప్రతిభకు తామే హద్దులు విధించుకోకుండా ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని తెలిపారు.వివేకవర్ధని డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, వారిలోని ప్రతిభను వెలికితీసి ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల్లో రాణించేలా నిరంతరం ప్రోత్సహిస్తోందని అన్నారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా మంచి సౌకర్యాలతో మెరుగైన విద్య బోధన అందించడంలో తమ ఉపాధ్యాయులు ముందున్నారని తెలిపారు. మంచిర్యాల జిల్లాకు చెందిన అనేక మంది విద్యార్థులు వేరొక ప్రాంతానికి వెళ్లి లక్షలు ఫీజులు చెల్లించి చదువుతున్నారని కార్పొరేట్ కళాశాలకు దీటుగా జిల్లాలోని మంచి సౌకర్యాలతో మెరుగైన విద్యను తమ కళాశాల విద్యను అందిస్తున్నామని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా జిల్లాలో మంచి ఫలితాలు సాధించడంలో తమ కళాశాల ముందుందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.శ్రీనివాస్ అధ్యాపకులు షరీనా, బి. రమేష్, శ్రీలేఖ, వైష్ణవి, పవిత్ర, శ్రీనివాస్, తిరుపతి, సతీష్, సమీర్, రమేష్, మమత, మౌనిక తదితరులు పాల్గొన్నారు. కార్పొరేట్ కళాశాలలకు వెళ్లి లక్షలు ఫీజులు చెల్లించి ఆర్థికంగా నష్టపోవడం తప్ప పెద్దగా ప్రయోజనం ఏమి లేదని తెలిపారు.

నూర్ భాషా దూదేకుల సమాజ భవన నిర్మాణానికి అందరూ ఐక్యంగా ముందుకు రావాలి

తెలంగాణ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు .. రాష్ట్ర జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ సయ్యద్ బాషా



ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: నూర్ భాషా దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘానికి సంబంధించిన భవన నిర్మాణానికి ప్రభుత్వం ప్రొసీడింగ్స్ జారీ చేయడంపై తెలంగాణ ప్రభుత్వానికి , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు , బీసీ ముఖ్య సలహాదారు ఈ. హనుమంతరావుకు ప్రత్యేక ధన్యవాదాలు , కృతజ్ఞతలు తెలియజేస్తూ ఖమ్మంలోని సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రహీం పాషా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు . ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ సయ్యద్ బాషా మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని తెలంగాణలోని నూర్ భాషా దూదేకుల సమాజంలోని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు . వ్యక్తిగత కక్షలు , రాజకీయ ప్రయోజనాలు , స్వార్థ ప్రయోజనాలను పక్కనపెట్టి సమాజ అభివృద్ధి కోసం అందరూ ఐక్యంగా ముందుకు రావాలని కోరారు . ప్రభుత్వం జారీ చేసిన ప్రొసీడింగ్స్ ఏ ఒక్క వ్యక్తికో, ఏ ఒక్క సంఘానికో పరిమితం కాదని , యావత్ తెలంగాణలోని నూర్ భాషా దూదేకుల సమాజానికి సంబంధించినవని స్పష్టం చేశారు . సోషల్ మీడియాలో కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని , ఈ విషయంలో అపోహలకు తావివ్వకుండా అందరూ సమిష్టిగా చర్చించుకొని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు . భవన నిర్మాణంలో ప్రతి సంఘం , ప్రతి నాయకుడు భాగస్వాములు కావాలని కోరారు . ఇందుకోసం మరో వారం నుంచి పది రోజుల్లో హైదరాబాద్‌లో రాష్ట్ర , జిల్లా , మండల స్థాయిలో పనిచేస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు , నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి , భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు . సమాజంలోని అన్ని వర్గాల సహకారంతో ఐక్యంగా ముందుకు సాగుదామని మీడియా ముఖంగా విజ్ఞప్తి చేశారు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ లాల్ జాన్ పాషా , రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ షకీనాబీ , ఖమ్మం జిల్లా అధ్యక్షుడు రహీం భాషా , జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్ధి భాషా , ఖమ్మం నగర అధ్యక్షుడు షేక్ రసూల్ , జిల్లా నాయకులు ఫరీద్ , దర్గా భాషా , సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల అధ్యక్షుడు , వల్లపురం గ్రామ కమిటీ సభ్యులు నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామ కమిటీ సభ్యులు , పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు .



పట్టభద్రుల ఓటరు నమోదుపై విస్తృత అవగాహన

గగన్‌పహాడ్ బస్తీల్లో నమోదు కార్యక్రమం

గండిపేట(క్రైమ్ మిర్రర్): అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించేందుకు గగన్‌పహాడ్ పరిధిలోని పలు బస్తీల్లో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పోరెడ్డి ధర్మారెడ్డి, ఎర్రోళ్ల యాదయ్య, సరికొండ దుర్గేష్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు. కేవలం ఓటు హక్కు కలిగి ఉండటమే కాకుండా, దానిని సద్వినియోగం చేసుకోవడం కూడా ప్రతి పట్టభద్రుడి బాధ్యత అని పేర్కొన్నారు. చాలామంది పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై సరైన అవగాహన లేకపోవడంతో తమ పేర్లను నమోదు చేసుకోవడం లేదని, అలాంటి వారిని గుర్తించి నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. యువత, ఉద్యోగులు, వివిధ వృత్తుల్లో ఉన్న పట్టభద్రులు ముందుకు వచ్చి ఓటర్లుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య బలోపేతంలో పట్టభద్రుల భాగస్వామ్యం ఎంతో అవసరమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో పోరెడ్డి ధర్మారెడ్డి, ఎర్రోళ్ల యాదయ్య, సరికొండ దుర్గేష్, తలారి శ్రీశైలం, ఈర్లపల్లి ప్రవీణ్, వల్లూరి నాగేష్, శీలం తిరుపతిరెడ్డి, వల్లూరి విజయ్, కరెంకోటి హనుమాన్ జీ, సురేందర్, తలారి కిరణ్, నర్సింహా, అకిరా నందన్, శ్రీనివాసులు, లక్ష్మణ్, లడ్డు తదితర నాయకులు పాల్గొన్నారు.

దూదేకుల ఆత్మ గౌరవ భవనం కు కాంగ్రెస్ ప్రభుత్వం 3 కోట్ల మంజూరు పట్ల హర్షం



ఫకీర్ సాబ్ శ్రమ ఫలితం 3కోట్ల నిధులు

బడే సాహెబ్, దూదేకుల జేఏసీ చైర్మన్

ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో : తెలంగాణ లో దూదేకుల ముస్లింల ఆత్మ గౌరవ భవనం కు కాంగ్రెస్ ప్రభుత్వం 3 కోట్ల మంజూరు పట్ల దూదేకుల జేఏసీ చైర్మన్ బడే సాహెబ్ హర్షం వ్యక్తం చేశారు.నిన్న ఖమ్మం లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు క్యాంప్ కార్యాలయం లో జరిగిన దూదేకుల జేఏసీ సమావేశం లో బడే సాహెబ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత నెల 29 న విడుదల చేసిన జిఓ 14 ప్రకారం రాష్ట్రంలో ఉన్న 38 బీసీ కులాలకు ఆత్మగౌరవభవనాలు నిర్మాణం కోసం 88 కోట్లు విడుదల చేయటం జరిగింది.అందులో దూదేకుల ఆత్మగౌరభవనం కోసం మూడు కోట్ల నిధులు మంజూరు చేయటం శుభ పరిణామం అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఏర్పడిన తరువాత దివంగత నేత పకీర్ సాహెబ్ కృషి ఎంతో ఉందని వారి శ్రమ ఫలితమే ఈరోజు మూడు కోట్ల నిధులు కేటాయించడం జరిగిందని వారితో పాటు మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గాలిబ్ సాబ్ కృషి కూడా అందులో ఉన్నదని వారు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పొన్నం ప్రభాకర్ లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న 16 లక్షల పైచిలుకు ఉన్న దూదేకుల జనాభా అందరికీ ఈ యొక్క ఆత్మగౌరవ భవనంలో హక్కు ఉంటుందని ఏ ఒక్కరికి చెందినది కాదని అందరి పోరాట ఫలితమే ఈ యొక్క ఆత్మగౌరవ భవనం అని వారు తెలియజేశారు, ఖమ్మం జిల్లా అధ్యక్షులు సలీం మాట్లాడుతూ ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం మూడు కోట్ల నిధులు కేటాయించడం శుభ పరిణామం అని దివంగత నేతలు పకీర్ సాహెబ్ గాలిబ్ సాబ్ ల పోరాటాల ఫలితమే ఈ యొక్క భవన నిర్మాణం అని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ కలాం, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ నాగ సైదులు అడ్వకేట్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మీరా సాహెబ్ కైకొండా యిగూడెం జిల్లా జేఏసీ ఉపాధ్యక్షులు షేక్ మౌలాలి ఖమ్మం నగర అధ్యక్షులు షేక్ అస్వర్ పాషా జిల్లా కమిటీ సభ్యులు షేక్ మస్తాన్ వలి కోటపాడు సైదులు యాకుబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.


నవంబర్ 8న జిల్లా వ్యాప్తంగా "మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి" వేడుకలు

6,617 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి..

లబ్ధిదారుల ఇళ్ల ముందు దీపాలు వెలిగించి సంబరాలు

ప్రతి గ్రామం, వార్డులో వేడుకలు ఘనంగా నిర్వహించాలి

జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చలపతిరావు



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 06: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా నవంబర్ 8న 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చలపతిరావు తెలిపారు. నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లలో లబ్ధిదారుల కుటుంబాలు దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మంజూరైన 3,48,977 ఇళ్లలో ఇప్పటికే 2,06,982 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 14,445 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 6,617 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మరో 7,828 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని వివరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబర్ 8న ప్రతి పూర్తయిన ఇందిరమ్మ ఇంటి ముందు లబ్ధిదారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి దీపాలు వెలిగించి వేడుకల్లో పాల్గొనాలని సూచించారు. ఇందుకు సంబంధించిన లోగో స్టిక్కరింగ్, లబ్ధిదారుల వివరాలను ఇంటి గోడలపై పెయింటింగ్ ద్వారా పొందుపరిచే ప్రక్రియను నవంబర్ 7లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వేడుకల్లో భాగంగా కుటుంబ సభ్యులతో కలిసి ఫొటోలు తీసి ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ప్రతి గ్రామం, వార్డు నుంచి కనీసం 2 ఫొటోలను సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముందు, నిర్మాణం పూర్తయిన తర్వాత తీసిన ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో @Indirammaindlu, @tghd.official, @telanganacmo ఖాతాలను ట్యాగ్ చేస్తూ #MaaIndirammaIntloDeepavali హ్యాష్‌ట్యాగ్‌తో పోస్టు చేయాలని కోరారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులందరూ కుటుంబ సభ్యులతో కలిసి నూతన గృహాల ముందు దీపాలు వెలిగించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొనాలని జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చలపతిరావు కోరారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శనివారం 7-11-2026
7

ఎల్ నినో పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి

వేసవి తాగునీటి అవసరాలపై ఇప్పటి నుంచే ప్రణాళిక

నీటి వనరుల సమర్థ వినియోగానికి ప్రత్యేక కార్యాచరణ

నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు తాగునీటి సరఫరాపై ప్రత్యేక కార్యాచరణ

తాగునీటి సరఫరాకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

తక్కువ నీటితో పండించే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 06: ఎల్ నినో పరిస్థితులు, రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ పాండు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూగర్భ జలాలు , నీటి వనరుల నిర్వహణ, పర్యవేక్షణ, తాగునీటి సరఫరాపై జిల్లా స్థాయి కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ, ఎల్-నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడే అవకాశాలు ఉన్నందున రాబోయే వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. తాగునీటి సరఫరాకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అందుబాటులో ఉన్న భూగర్భ, ఉపరితల నీటి వనరులను పొదుపుగా, సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. ఈ నెల 15 నుంచి డిసెంబర్ 31 వరకు జిల్లావ్యాప్తంగా తాగునీటి సరఫరా మౌలిక సదుపాయాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఇందులో భాగంగా గ్రామాల్లోని తాగునీటి సరఫరా వ్యవస్థలు, పైపులైన్లు, నీటి వనరులు, పంపులు, మోటార్ల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. లీకేజీలు, మరమ్మతులు అవసరమైన ప్రాంతాలు, సరఫరాలో ఉన్న లోపాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహణకు మండల స్థాయిలో ఇంట్రా విభాగం ఏఈఈలు, గ్రిడ్ విభాగం ఏఈఈలు, ఎంపీఓలు, సంబంధిత గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి మండలంలోని అన్ని గ్రామాల్లో రోజువారీ తనిఖీలకు షెడ్యూల్ రూపొందించి, క్షేత్ర స్థాయిలో తనిఖీల నిర్వహించి నివేదికలు సమర్పించాలని సూచించారు. వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు జిల్లాలో విస్తృత చర్యలు చేపట్టాలి. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహించాలి. బోరుబావుల వద్ద సోక్‌పిట్లు ఏర్పాటు చేయడంతో పాటు, బోరుబావుల రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టాలి. ఇళ్లపై పడే వర్షపు నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలి. బోరుబావుల పరిసరాల్లో వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. తద్వారా భూగర్భ జలమట్టం పెరిగి భవిష్యత్తులో తాగునీటి కొరతను నివారించేందుకు వీలవుతుందని ఆయన స్పష్టం చేశారు . గ్రామాల్లో చేతిపంపులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ మోటార్లకు మరమ్మతులు చేపట్టి వినియోగానికి సిద్ధంగా ఉంచాలి. పైపులైన్లు, వాల్వ్‌ల లీకేజీలను అరికట్టాలి. ఓహెచ్ఎస్ఆర్, జీఎల్ఎస్ఆర్ ట్యాంకులు, సంపులను నిర్దిష్ట సమయంలో శుభ్రం చేయాలి. తాగునీటిలో క్లోరినేషన్ సక్రమంగా జరిగేలా చూడాలని, బ్లీచింగ్ పౌడర్ నిల్వలు అందుబాటులో ఉంచాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో వినియోగించేందుకు నీటి ట్యాంకర్లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. నీటి కొరతకు అవకాశం ఉన్న గ్రామాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ నీటి వనరులను పరిశీలించాలి. స్థానిక భూగర్భ జల వనరుల లభ్యత, నీటి నాణ్యత, నిల్వ సామర్థ్యాన్ని అంచనా వేయాలి. అవసరమైన చోట అనుమతులతో ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాట్లు చేయాలి. విద్యుత్ శాఖ, నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ గ్రిడ్, మిషన్ భగీరథ ఇంట్రా, ఇంజినీరింగ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. నీటి వనరుల లభ్యత, విద్యుత్ సరఫరా, మరమ్మతులు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. అలాగే వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తక్కువ నీటిని వినియోగించే పంటల సాగుపై అవగాహన కల్పించాలని, ముఖ్యంగా వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహించాలని సూచించారు. ప్రత్యేక డ్రైవ్‌లో చేపట్టిన పనులపై మండల స్థాయిలో సమీక్షలు నిర్వహించి, ప్రతి వారం సమగ్ర నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఎల్-నినో పరిస్థితులు ముగిసే వరకు తాగునీటి సరఫరా పరిస్థితిని పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీసీఈఓ జానకి రెడ్డి, నీటిపారుదల శాఖ ఈ ఈ జై భీం, భూగర్భ జలాల అభివృద్ధి శాఖ డి డి మోహన్, ఆర్ డబ్ల్యూ ఎస్, ఎస్ ఈ పాషా, విద్యుత్ శాఖ అధికారులు, మిషన్ భగీరథ్ గ్రిడ్ ఈఈ విజయలక్ష్మి, సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



పేదల ఇళ్ల తొలగింపును అడ్డుకున్న ఆదర్శ్ రెడ్డి

40 ఏళ్లుగా అక్కడే నివాసం.. ప్రత్యామ్నాయం లేకుండా ఇళ్ల తొలగింపా?

బాధితులకు ప్రత్యామ్నాయ నివాసం కల్పించాలి

రైల్వే అధికారులకు 45 రోజుల గడువు కోరిన బీఆర్ఎస్ నేత

45 రోజుల గడువుకు రైల్వే అధికారుల హామీ

బాధితులకు ప్రత్యామ్నాయ నివాసాలు కల్పించాలని విజ్ఞప్తి

ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో ఫోన్‌లో మాట్లాడిన ఆదర్శ్ రెడ్డి

రామచంద్రాపురం, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 06: ఓల్డ్ ఎం.ఐ.జి. ప్రాంతంలో గత 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేద కుటుంబాల ఇళ్ల తొలగింపు చర్యలను పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి అడ్డుకున్నారు. రైల్వే అధికారులు, పోలీసులు ఇళ్ల తొలగింపునకు వచ్చిన విషయం తెలుసుకున్న ఆయన వెంటనే అక్కడికి చేరుకుని బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు. ఎన్నో ఏళ్లుగా అక్కడే నివసిస్తున్న పేదలకు ప్రత్యామ్నాయ నివాసాలు కల్పించకుండా ఇళ్లను తొలగించడం అన్యాయమని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. బాధితులకు ప్రత్యామ్నాయ నివాస ఏర్పాట్లు కల్పించేలా కృషి చేస్తామని ఆదర్శ్ రెడ్డి హామీ ఇచ్చారు. అలాగే మానవతా దృక్పథంతో వ్యవహరించి పేద కుటుంబాలకు కనీసం 45 రోజుల గడువు ఇవ్వాలని రైల్వే అధికారులను కోరారు. దీనిపై స్పందించిన రైల్వే సిబ్బంది 45 రోజుల వరకు వేచి ఉంటామని హామీ ఇచ్చారు. దీంతో బాధిత కుటుంబాలు ఊరట చెందాయి.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, భాస్కర్ ముదిరాజ్, గిరి, నర్సింహా, సంపత్ గౌడ్, చిన్న, తిలావత్, రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసై దొంగగా మారి...

జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న యువకుడు

హుజూర్‌నగర్ లో బంగారు ఆభరణాల చోరీ కేసు చేదించిన పోలీసులు

రూ1.80 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

అమ్మమ్మ మేనత్త బంగారు ఆభరణాలు దొంగిలించిన యువకుడు అరెస్ట్

వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి



క్రైమ్ మిర్రర్, హుజూర్ నగర్: కోడిపందాలు, చెడు వ్యసనాలకు బానిసై అప్పులపాలైన ఓ యువకుడు తన ఆర్థిక అవసరాలు తీర్చుకునేందుకు సొంత కుటుంబ సభ్యుల బంగారు ఆభరణాలనే దొంగిలించిన ఘటన హుజూర్‌నగర్ పట్టణంలో వెలుగుచూసింది. ఈ కేసులో నిందితుడిని పోలీసులు పట్టుకుని బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ చరమంద రాజు తో కలిసి మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హుజూర్‌నగర్ పట్టణంకు చెందిన మల్లెబోయిన నిఖిల్ (19), తండ్రి వెంకటేశ్వర్లు, చిన్నతనం నుంచి తన అమ్మమ్మ, తాతయ్య ఇంట్లో ఉంటూ పెరిగాడు. ప్రస్తుతం కోదాడ పట్టణంలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అయితే గత రెండేళ్లుగా పాత నేరస్థుడు తన క్లాస్‌మేట్‌తో కలిసి చెడు వ్యసనాలకు అలవాటుపడి కోడిపందాల్లో పందాలు కాస్తూ పెద్ద మొత్తంలో డబ్బులు పోగొట్టుకున్నాడు. అప్పులు తీర్చేందుకు తెలిసిన వారి వద్ద అధిక వడ్డీకి డబ్బులు తీసుకొని మళ్లీ కోడిపందాలు ఆడుతూ ఆర్థికంగా ఇబ్బందుల్లో పడ్డాడు. చేసిన అప్పులు తీర్చలేక దొంగతనాలకు పాల్పడాలని నిర్ణయించుకున్నాడు.ఈ క్రమంలో సుమారు ఆరు నెలల క్రితం తన అమ్మమ్మ కు చెందిన బంగారు గొలుసును దొంగిలించాడు. అనంతరం తన స్నేహితుడితో కలిసి అందులోని అర తులం బంగారాన్ని కరిగించి గుర్తుతెలియని వ్యక్తులకు విక్రయించి వచ్చిన డబ్బులను విలాసాలకు ఖర్చు చేశారు. మళ్లీ ఈ నెల 3-11-2026 రాత్రి తన మేనత్త కు చెందిన మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడును దొంగిలించాడు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో హుజూర్‌నగర్ పట్టణంలో గోల్డ్ షాపుల వైపు సిబ్బందితో కలిసి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన నిందితులను పట్టుకున్నారు. విచారణలో వారు నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.నిందితుల నుంచి ఒక తులం కరిగించిన బంగారు ముద్దతో పాటు మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ

హుజూర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో అంతర్రాష్ట్ర దొంగల ముఠాలు సంచరిస్తున్నట్లు సమాచారం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా 112 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డీఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ చరమంద రాజు, ఎస్ఐ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయాల్లో మహిళల ప్రాముఖ్యత కీలకం

విద్యావంతులను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించి కవిత ఆదర్శంగా నిలిచింది

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించేందుకు మహిళా శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలి

జిల్లా మహిళా అధ్యక్షురాలు అనుముల స్వప్న



కూకట్ పల్లి, నవంబర్ 06 (క్రైమ్ మిర్రర్) : మేడ్చల్ – మల్కాజ్ గిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని రంగారెడ్డి నగర్‌లో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా సదస్సు ఘనంగా, విజయవంతంగా ముగిసింది. జిల్లా మహిళా అధ్యక్షురాలు అనుముల స్వప్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాచరణ, పార్టీ బలోపేతంలో మహిళల పాత్రపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ రాజకీయాల్లో మహిళామణుల ప్రాముఖ్యత ఎంతో కీలకమని, సామాజిక న్యాయం మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపించే పార్టీ తెలంగాణ రక్షణ సేన అని స్పష్టం చేశారు. ఇందుకు నిదర్శనంగా ఉన్నత విద్యావంతులైన శ్రీకాంత్ గౌడ్, ఆకాష్‌లను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించి కవితమ్మ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. పార్టీ నాయకత్వం ఎంతో నమ్మకంతో అభ్యర్థులను రంగంలోకి దించినందున, రంగారెడ్డి – మహబూబ్‌నగర్ – హైదరాబాద్ స్థానంలో వారిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు మహిళా శ్రేణులు సమిష్టిగా ప్రతి ఇంటికీ వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న తమ పార్టీ అభ్యర్థుల గెలుపునకు సైనికుల్లా శ్రమించి, భవిష్యత్‌లో కవితమ్మను అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలని వక్తలు ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పడాల మనోజ, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆకాష్, మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనగాల చైతన్య, పార్లమెంట్ ఇన్‌చార్జ్ వేముల భవాని, కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జ్ మారన్న, జిల్లా అధ్యక్షులు కె. నవీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి వీరన్న, రాష్ట్ర అధికార ప్రతినిధి సీతారాం, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాళ్లు ఐలి కవిత, సంధ్యారెడ్డి, కుత్బుల్లాపూర్ మహిళా అధ్యక్షురాలు శాంత, ఉప్పల్ మహిళా అధ్యక్షురాలు సుధారెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షురాలు జ్యోతి, సీనియర్ మహిళా నాయకురాళ్లు స్వప్న, ఊర్మిళ, ఫరా బేగం సోనీ, విజయతో పాటు పెద్ద సంఖ్యలో మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సదస్సును విజయవంతం చేసిన నాయకులందరికీ అనుముల స్వప్న కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థుల ప్రతిభా ప్రదర్శనతో ఘనంగా టెక్ మీడియా ఉత్సవ్

ఒకేషనల్ విద్యార్థుల నైపుణ్యాలకు వేదికగా టెక్ మీడియా ఉత్సవ్..

విద్యార్థుల ప్రదర్శనలకు విశేష స్పందన



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: కల్వకుర్తి పట్టణంలోని సావిత్రిబాయి పూలే ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు తమలోని సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలను అద్భుతంగా ప్రదర్శించడంతో టెక్ మీడియా ఉత్సవ్ కార్యక్రమం విజయవంతమైంది. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ఒకేషనల్ విద్యార్థులు తమ విద్యాభ్యాసంలో నేర్చుకున్న అంశాలను ఆచరణాత్మకంగా ప్రదర్శిస్తూ, వాటి ఉపయోగాలు, పనితీరును ఇతర విద్యార్థులకు వివరించడం ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు వివిధ అంశాలపై రూపొందించిన నమూనాలు, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రదర్శనలు, తమ కోర్సుల్లో నేర్చుకున్న నైపుణ్యాలను సందర్శకులకు వివరించారు. కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, విద్య ద్వారా పొందిన జ్ఞానాన్ని ఆచరణలో ఎలా ఉపయోగించుకోవచ్చో తమ ప్రదర్శనల ద్వారా తెలియజేశారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఆత్మవిశ్వాసంతో తమ ప్రతిభను చాటుకోవడం పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్, వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు బాలాజీ సింగ్, డీఎస్పీ వెంకట్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించి వారి ప్రతిభను అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవడం భవిష్యత్తులో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ టెక్ మీడియా ఉత్సవ్‌లో పట్టణంలోని సుమారు 500 మంది పాఠశాల విద్యార్థులు పాల్గొని వివిధ ప్రదర్శనలను తిలకించారు. ఒకేషనల్ విద్య ద్వారా నేర్చుకునే అంశాలు, వాటి ప్రాధాన్యత, భవిష్యత్తులో వాటి ద్వారా లభించే ఉపాధి అవకాశాలపై అవగాహన పొందారు. విద్యార్థుల సందేహాలను ప్రదర్శించిన కళాశాల విద్యార్థులు నివృత్తి చేస్తూ కార్యక్రమాన్ని మరింత ఆసక్తికరంగా నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మక ఆలోచనా విధానం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఒకేషనల్ విద్యకు మరింత గుర్తింపు తీసుకువచ్చేలా ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అతిథులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కళాశాల యాజమాన్య ప్రతినిధులు మేకల రాజేందర్, సహస్ర, రహమత్, నవీన్, ప్రవల్లిక, సిద్ధార్థ, అమీర్, నవ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
8 | శనివారం | 7-11-2026

రామప్ప శిల్పకళ.. నాటి సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనం

కాకతీయుల నిర్మాణ కౌశలం అద్భుతం

ప్రసాద్ పథకం పనుల వివరాలను అడిగి తెలుసుకున్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

రామప్ప దేవాలయాన్ని సందర్శించిన రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఐఏఎస్






వెంకటాపూర్ (రామప్ప) క్రైమ్ మిర్రర్, నవంబర్ 06: రామప్ప దేవాలయ శిల్పకళ, నిర్మాణ కౌశలం నాటి సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. కాకతీయుల కాలం నాటి ఇంజినీరింగ్ పరిజ్ఞానం, ఆలయ నిర్మాణంలో అనుసరించిన పద్ధతులు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు.శుక్రవారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయాన్ని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనాతో కలిసి సందర్శించారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ మండపంలో కార్యనిర్వహణ అధికారి ఇమ్మడి భాస్కర్ శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పర్యాటక మార్గదర్శి గోరంట్ల విజయ్ కుమార్ కాకతీయుల చరిత్ర, రామప్ప ఆలయ నిర్మాణ విశేషాలు, శిల్పకళా వైభవాన్ని వివరించారు. నీటిలో తేలియాడే ఇటుకలు, ఆలయ నిర్మాణంలో ఉపయోగించిన డోలరైట్, బసాల్ట్, ఇసుకరాయి, సాండ్‌బాక్స్ సాంకేతికత గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఆలయంలోని శిల్పాలను పరిశీలిస్తూ, ఆలయ చరిత్ర, నిర్మాణ ప్రత్యేకతలపై జిల్లా కలెక్టర్‌తో చర్చించారు. శిల్పి పేరుతో ఆలయం ప్రాచుర్యం పొందడం రామప్ప ప్రత్యేకతగా పేర్కొన్నారు. ఆలయ శిల్పాల్లో చరిత్ర, పురాణాలతోపాటు నాటి వస్త్రధారణ, కళలు, ఆటలకు సంబంధించిన అంశాలను ప్రతిబింబించిన తీరు విశేషమని అన్నారు. ఆనాటి జీవన విధానాన్ని, కళా వైభవాన్ని శిల్పాల రూపంలో భవిష్యత్ తరాలకు అందించిన వారసత్వ సంపద అమోఘమని కొనియాడారు. అనంతరం ప్రసాద్ పథకం కింద చేపడుతున్న నిర్మాణ పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం ద్వారా ఆలయ పరిసరాల్లో భక్తులు, పర్యాటకుల కోసం కల్పిస్తున్న సదుపాయాల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గిరిబాబు, ఎంపీడీఓ రాజు, ఎస్సై రాజు, డిప్యూటీ రేంజ్ అధికారి మధుబాబు, ఆర్ఐ రమేష్, జీపీఓ సూరయ్య, పర్యాటక పోలీసులు దశరథ్, శ్రీనివాస్, అరుణ్, శ్రీకాంత్, బద్రు, రెవెన్యూ, పోలీసు, అటవీ, పురావస్తు, దేవాదాయ, పర్యాటక శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అబద్ధపు ఆరోపణలు మానండి... కూకట్‌పల్లి అభివృద్ధికి సహకరించండి!

నిరుపేదల సొంతింటి కలకు అడ్డుపడకండి

రమ్య గ్రౌండ్ వద్ద ఎన్టీఆర్ పేరుతో పాఠశాల నిర్మాణం ఏమైంది

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కి సూటి ప్రశ్నలు వేసిన శేరి సతీష్ రెడ్డి



కూకట్ పల్లి, నవంబర్ 06 (క్రైమ్ మిర్రర్) : కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గత పదేళ్లుగా తెలంగాణలో మీ పార్టీ అధికారంలో ఉంది. మీరు చెప్పిన పనులు చేయించుకునే అవకాశం, ప్రభుత్వంపై పలుకుబడి ఉన్న సమయంలో కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ఈ అంశాలు ఎందుకు గుర్తుకు రాలేదు? ఇప్పుడు ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై విమర్శలు చేయడం కంటే నిర్మాణాత్మకంగా సహకరిస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుందిని కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్చార్జి సేరి సతీష్ రెడ్డి హితవు పలికారు.

మెట్రో పార్కులో స్టేడియం నిర్మాణం

కూకట్‌పల్లి మెట్రో పార్కులో యువత కోసం స్టేడియం నిర్మించాలనే ఆలోచన గత పదేళ్లలో ఎందుకు కార్యరూపం దాల్చలేదు? మీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రతిపాదనపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ప్రజలకు సమాధానం చెప్పాలి.

కేపీహెచ్‌బీ--జేఎన్‌టీయూ రోడ్డులో పెట్రోల్ బంక్ అంశం

కేపీహెచ్‌బీ--జేఎన్‌టీయూ రోడ్డులో పెట్రోల్ బంక్ ఏర్పాటు అంశం ఇప్పుడు గుర్తుకు వచ్చిందా? గత పదేళ్లలో ఈ స్థలానికి సంబంధించి మీరు తీసుకున్న నిర్ణయాలు ఏమిటి? ఈ అంశంపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలి.

రమ్య గ్రౌండ్ వద్ద ఎన్టీఆర్ పేరుతో పాఠశాల

రమ్య గ్రౌండ్ సమీపంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు పేరుతో పాఠశాల నిర్మిస్తామని చెప్పి మీ పార్టీకి చెందిన కార్పొరేటర్ డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలపై మీ సమాధానం ఏమిటి? ఆ పాఠశాల నిర్మాణం ఏమైంది? నిధుల సేకరణ జరిగి ఉంటే వాటి వివరాలను ప్రజల ముందు ఉంచాలి.

నిరుపేదల సొంతింటి కలకు అడ్డుపడకండి

హైదరాబాద్ మహానగరంలో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు ఇంటి అద్దెల భారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అలాంటి కుటుంబాలకు సొంతింటి కలను నిజం చేసే దిశగా తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో ఎల్ఐజి, ఎం ఐ జి గృహాల నిర్మాణం చేపట్టాలనే ఆలోచనను స్వాగతించాలి. దాదాపు రూ.40 లక్షల విలువైన ఇంటిని రూ.6 లక్షలకే అందించే ప్రతిపాదన, లక్ష మంది గృహ అవసరాలను తీర్చాలనే లక్ష్యం నిజంగా అమలైతే అది పేద, మధ్యతరగతి కుటుంబాలకు గొప్ప ఊరట అవుతుంది. ఈ ప్రతిపాదనకు సంబంధించిన అర్హతలు, నిధులు, అమలు విధానాన్ని ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించాలి. ఇలాంటి ప్రజాప్రయోజన కార్యక్రమాలను రాజకీయ కోణంలో చూడకుండా, నిరుపేదలకు మేలు జరిగేలా ఎమ్మెల్యేగా మీరు సహకరించాలి.

ఎమ్మెల్యే కృష్ణారావు గారికి నా సలహా!

కృష్ణారావు మీరు కూకట్‌పల్లి ప్రజల ఆశీర్వాదంతో వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ సాధించారు. అది అందరికీ తెలిసిన విషయమే. మీ రాజకీయ అనుభవాన్ని, ప్రజలిచ్చిన అవకాశాన్ని నియోజకవర్గ అభివృద్ధికి ఉపయోగించాల్సిన సమయం ఇది. ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే అభివృద్ధి కార్యక్రమంలో మీరు భాగస్వాములు కావాలని మా కోరిక. మంచి కార్యక్రమాలకు మద్దతు తెలపండి. అవసరమైతే ప్రజా ప్రభుత్వంతో కలిసి పనిచేసే దిశగా, రాజకీయంగా కూడా మీ నిర్ణయాన్ని పునరాలోచించండి. రాజకీయ విమర్శల కంటే ప్రజల అభివృద్ధే ముఖ్యమని గుర్తించండి. కూకట్‌పల్లి ప్రజలకు కావాల్సింది రాజకీయ ఆరోపణలు కాదు... అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, నిరుపేదలకు సొంత ఇళ్లు, యువతకు మెరుగైన అవకాశాలు! ఒక్కసారి ఆలోచించండి కృష్ణారావు. కూకట్‌పల్లి అభివృద్ధికి అందరం కలిసి పనిచేద్దాం!.

ఏఐ రంగంలో నూతన శిక్షణకు ఐఐటీ హైదరాబాద్ శ్రీకారం

మూడు నెలల ఫార్వర్డ్ డిప్లాయ్డ్ ఇంజినీరింగ్ ప్రోగ్రామ్ ప్రకటన

డిసెంబర్ 5 నుంచి శిక్షణ ప్రారంభం.. పూర్తి చేసిన వారికి ఐఐటీ ధ్రువపత్రం



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 06: కృత్రిమ మేధ సాంకేతికతను కేవలం నమూనాల రూపకల్పనకే పరిమితం చేయకుండా, వాస్తవ ప్రపంచంలో వినియోగించే స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ఐఐటీ హైదరాబాద్ కీలక కార్యక్రమాన్ని ప్రకటించింది. మూడు నెలల ఫార్వర్డ్ డిప్లాయ్డ్ ఇంజినీరింగ్ ప్రాక్టీషనర్ ప్రోగ్రామ్‌ను డిసెంబర్ 5, 2026 నుంచి ప్రారంభించనుంది. ఏఐ ఆధారిత నమూనాలను సంస్థల సాఫ్ట్‌వేర్ వ్యవస్థలు, డేటా, వ్యాపార ప్రక్రియలతో అనుసంధానించి సమర్థవంతంగా అమలు చేయడంపై ఈ శిక్షణలో ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఏజెంటిక్ ఏఐ వ్యవస్థలు, వర్క్‌ఫ్లోలు, ఆటోమేషన్, ప్రొడక్షన్ ఏఐ ఇంజినీరింగ్ వంటి ఆధునిక సాంకేతిక అంశాలను ప్రాయోగికంగా బోధించనున్నారు. మూడు నెలలపాటు కొనసాగే ఈ కార్యక్రమంలో తరగతి గది బోధనతో పాటు ప్రాయోగిక ల్యాబ్ శిక్షణ, ఐఐటీ హైదరాబాద్ అధ్యాపకుల పరిశోధన ప్రసంగాలు, పరిశ్రమ నిపుణుల వెబినార్లు, ప్రత్యక్ష సిస్టమ్ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఏఐ వ్యవస్థలను అభివృద్ధి చేయడం, వాటిని వాస్తవ పరిస్థితుల్లో అమలు చేయడం, పనితీరును పర్యవేక్షించడం, నిరంతరం మెరుగుపరచడంపై శిక్షణ ఇవ్వనున్నారు.ఐఐటీ హైదరాబాద్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన డాక్టర్ ప్రవీణ్ తమ్మన ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించనున్నారు. డాక్టర్ ఆశిష్ మిశ్రా, డాక్టర్ అనుపమ్ సంఘీ, డాక్టర్ అభిజిత్ దాస్ కార్యక్రమ నిర్వహణలో భాగస్వాములు కానున్నారు. పరిశ్రమ విభాగం నాయకుడిగా ఎన్.వి.ఎస్.ఎస్. కౌండిన్య వ్యవహరించనున్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు ఐఐటీ హైదరాబాద్ ధ్రువపత్రం అందజేయనుంది. సీట్లు పరిమితంగా ఉండటంతో ఆసక్తి గల వృత్తి నిపుణులు, సంస్థలు ముందుగానే నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

రిజిస్ట్రేషన్ వివరాలు: https://ailaunchpad.cse.iith.ac.in/
సంప్రదించాల్సిన నంబర్: 7386965827
ఈమెయిల్: ailaunchpad@cse.iith.ac.in

కబడ్డీ ఆడి విద్యార్థుల్లో ఉత్సాహం నింపిన పోలీస్ అకాడమీ డైరెక్టర్

పీఎం శ్రీ పాఠశాలల రాష్ట్రస్థాయి కబడ్డీ ఫైనల్ పోటీలను ప్రారంభించిన అభిలాష బిస్ట్





గండిపేట(క్రైమ్ మిర్రర్): విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసం, జట్టుస్ఫూర్తిని ప్రోత్సహించే లక్ష్యంతో హైదరాబాద్‌లోని ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ (టీజీపీఏ)లో నిర్వహిస్తున్న పీఎం శ్రీ పాఠశాలల రాష్ట్రస్థాయి బాలబాలికల కబడ్డీ పోటీలు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. రెండు రోజులుగా జరుగుతున్న ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన బాలబాలికల జట్లు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నాయి. వివిధ దశల్లో జరిగిన పోటీల్లో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్న బాలుర, బాలికల జట్ల మధ్య తుది పోటీలను శుక్రవారం తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్ట్, ఐపీఎస్, విశ్వంభర గ్రౌండ్‌లో టాస్ వేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ అభిలాష బిస్ట్ స్వయంగా కబడ్డీ మైదానంలోకి దిగి క్రీడాకారులతో కలిసి ఆటలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులతో కలిసి కబడ్డీ ఆడుతూ వారిని ఆశ్చర్యపరిచారు. ఆమె ఆటలో పాల్గొనడంతో విద్యార్థుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. క్రీడాకారులను అభినందిస్తూ, పోటీల్లో ఆత్మవిశ్వాసంతో ఆడాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా అభిలాష బిస్ట్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో క్రీడలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టుస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు అలవడతాయని తెలిపారు. గెలుపోటములను సమానంగా స్వీకరించే మనస్తత్వం క్రీడల ద్వారానే అలవడుతుందని అన్నారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడలపైనా ఆసక్తి పెంచుకోవాలని, తమలోని ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల ఆరోగ్యకరమైన జీవనశైలితో పాటు పట్టుదల, కష్టపడే తత్వం పెంపొందుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌తో పాటు డిప్యూటీ డైరెక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు, ఏడీ (వర్క్స్) వేముల శ్రీనివాసరావు, పోటీల నిర్వాహకులు, పోలీస్ అకాడమీ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం

భారతీయ విద్యా భవన్ విద్యాశ్రమంలో టీచర్లకు ఆన్‌లైన్ ఎన్రోల్మెంట్

గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్‌డీ భారతీయ విద్యా భవన్ విద్యాశ్రమం పాఠశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఉపాధ్యాయుల కోసం ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్ సూచనలు, సలహాల మేరకు అర్హులైన ఉపాధ్యాయులందరూ ఆన్‌లైన్ ద్వారా ఎమ్మెల్సీ ఓటరు నమోదును పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ముఖ్యంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య బలోపేతానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని ఆన్‌లైన్ ఎన్రోల్మెంట్ ప్రక్రియను పూర్తి చేయడం పట్ల నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. అర్హులైన పట్టభద్రులు ఎవరూ ఓటరు నమోదుకు దూరం కాకుండా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ--గోషామహల్ జిల్లా ఇన్‌చార్జి వై. శ్రీధర్, డివిజన్ మాజీ అధ్యక్షుడు జి. బాబురావు, లీగల్ సెల్ జిల్లా నాయకుడు ధీరజ్ యాదవ్, సీనియర్ నాయకులు గాజుల రవికుమార్, పెంటయ్య, జ్ఞానేశ్వర్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల్లో భద్రతా నిబంధనలు తప్పనిసరి



నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రమాదాలకు ఆస్కారం

నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి.. అధికారుల సూచనలు

గండిపేట(క్రైమ్ మిర్రర్): పండుగల నేపథ్యంలో బాణసంచా దుకాణాల నిర్వాహకులు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు సూచించారు. బాణసంచా విక్రయాలు, నిల్వ సమయంలో అగ్నిప్రమాదాలు సంభవించకుండా అన్ని భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రతి బాణసంచా దుకాణంలో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు తగినంత నీరు, ఇసుకతో పాటు అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. దుకాణాల చుట్టుపక్కల చెత్తాచెదారం, మండే స్వభావం కలిగిన వస్తువులు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. అదేవిధంగా దుకాణాల పరిసరాల్లో తగినంత ఖాళీ స్థలం ఉండేలా చూసుకోవాలని, అగ్నిమాపక వాహనాలు, ఇతర అత్యవసర సేవల వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా బాణసంచా దుకాణాల సమీపంలో ధూమపానం, బహిరంగ మంటలు వెలిగించడం, అగ్నిప్రమాదాలకు దారితీసే ఎలాంటి కార్యకలాపాలను అనుమతించకూడదని హెచ్చరించారు. బాణసంచాను నిర్దేశించిన భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా మాత్రమే నిల్వ చేయాలని, విక్రయాలు కూడా నిబంధనల ప్రకారమే చేపట్టాలని సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా భారీ అగ్నిప్రమాదానికి దారితీసే ప్రమాదం ఉన్నందున దుకాణ నిర్వాహకులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ దృష్ట్యా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవడం ప్రతి వ్యాపారి బాధ్యత అని స్పష్టం చేశారు. బాణసంచా దుకాణాల నిర్వాహకులందరూ అధికారులకు సహకరిస్తూ దుకాణాల నిర్వహణ పూర్తయ్యే వరకు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కోరారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శనివారం 7-11-2026
9

మందమర్రి సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక: మంత్రి వివేక్ వెంకటస్వామి

68 మందికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

వెయ్యి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సింగరేణి భూమి సేకరణకు చర్యలు

రూ.7 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్.. 50 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు కృషి

రూ.30 కోట్లతో తాగునీటి పథకాలు.. మూడు నెలల్లో రోడ్లు, మురుగు కాలువల పనులు పూర్తి

స్థానిక యువతకు ఉపాధి, నైపుణ్య శిక్షణకు ప్రత్యేక చర్యలు



మందమర్రి, నవంబర్ 6 (క్రైమ్ మిర్రర్): మందమర్రి పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం మందమర్రిలోని బి–1 క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి పాల్గొని 68 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మంజూరైన చెక్కులను రెండు రోజుల్లోగా లబ్ధిదారులకు అందించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మందమర్రిలో ఇళ్ల సమస్య పరిష్కారానికి సింగరేణి భూమిని సేకరించి సుమారు వెయ్యి ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. మందమర్రిలో రూ.7 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని, సోమనపల్లిలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తున్నామని చెప్పారు. పట్టణంలో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు స్థల పరిశీలన పూర్తయిందని, వచ్చే ఏడాది మార్చిలోగా అనుమతులు పొంది పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు. మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల పనులు చేపట్టామని, మూడు నుంచి నాలుగు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. సుమారు రూ.30 కోట్లతో తాగునీటి పథకాలు అమలు చేసి ఇంటింటికీ నీరు అందిస్తామన్నారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు కొత్త గని ఏర్పాటు, ఏటీసీ శిక్షణ కేంద్రం ద్వారా నైపుణ్య శిక్షణ, జర్మన్ భాషలో శిక్షణ అందిస్తున్నామని వివరించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని, రైతులు నీటి లభ్యతను బట్టి పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అధిక నీరు అవసరమయ్యే వరి సాగు విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలతో పేద కుటుంబాలకు ప్రయోజనం కలుగుతోందన్నారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కోటపల్లి మండలంలో ఎస్సీ వసతి గృహం, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో అదనపు గదుల నిర్మాణానికి రూ.1.60 కోట్లతో చర్యలు చేపట్టామన్నారు. రామకృష్ణాపూర్‌లో సింగరేణి సహకారంతో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అమృత్ పథకం కింద మందమర్రిలో తాగునీటి పైప్‌లైన్ పనులు, క్యాతనపల్లిలో రెండు నీటి ట్యాంకులు, చెన్నూరులో మూడు ట్యాంకుల నిర్మాణ పనులు చేపట్టినట్లు వివరించారు. మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి తహసీల్దార్ సతీష్, మున్సిపల్ కమిషనర్ రాజలింగు, డీసీసీ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నార్సింగి సర్కిల్‌లో అభివృద్ధికి మహర్దశ

రూ.6.48 కోట్ల పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

రోడ్లు, పార్కులు, గ్రంథాలయ భవనాల నిర్మాణానికి శ్రీకారం



గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని నార్సింగి సర్కిల్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. నార్సింగి, ఖానాపూర్, గండిపేట, వట్టినాగులపల్లి ప్రాంతాల్లో మొత్తం రూ.6 కోట్ల 48 లక్షల 60 వేల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ శంకుస్థాపనలు చేయడంతో పాటు పూర్తయిన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే స్థానిక ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ముఖ్యంగా అంతర్గత రహదారుల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, గ్రంథాలయ భవనం, పశువుల షెడ్ తదితర పనులకు నిధులు కేటాయించడం విశేషం. నార్సింగి వార్డు 124లో వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద రూ.28.50 లక్షలతో పశువుల షెడ్ నిర్మాణం చేపట్టనున్నారు. ఖానాపూర్, గండిపేట వార్డు 126లో రూ.20 లక్షలతో గ్రంథాలయ భవనాన్ని నిర్మించనున్నారు. నార్సింగి వార్డు 124 పరిధిలో పలు కాలనీల్లో రూ.1.58 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. హెచ్.నెం. 3–7/401 నుంచి శ్రీ చైతన్య కళాశాల వరకు, బేహిల్స్ రోడ్డు, జెరూసలేం చర్చి నుంచి కాసా శాక్సిమా వరకు, సిరి గోల్డెన్ స్క్వేర్ అపార్ట్‌మెంట్ నుంచి సాదిక్ రెసిడెన్సీ వరకు, నార్సింగి హైట్స్, సాయిబాబా స్పెషాలిటీ రోడ్డు నుంచి సంవిత రెసిడెన్సీ వరకు, రాక్ గార్డెన్ నుంచి శ్రీ చైతన్య స్కూల్ వరకు రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. నార్సింగి హైట్స్‌లోని హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ వాటర్ ట్యాంక్ పక్కన పార్కు, డాగ్ పార్కు ఏర్పాటుకు రూ.83 లక్షలతో ప్రహరీ గోడ నిర్మించనున్నారు. అదేవిధంగా వైఎస్ఆర్ విగ్రహం నుంచి నిర్మల ఆసుపత్రి వరకు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి 60 ఫీట్ రోడ్డు వరకు, ఏఆర్ఎం కాఫీ ప్యాలెస్ నుంచి వరలక్ష్మి టిఫిన్ సెంటర్ వరకు రూ.94 లక్షలతో ఆర్సీసీ సెంట్రల్ మీడియన్ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. గండిపేట వార్డు 125లో అల్లు సినిమా నుంచి బస్‌స్టాప్ వరకు రూ.98 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించనున్నారు. వట్టినాగులపల్లి గ్రామం, గండిపేట వార్డు 126 పరిధిలోని పలు వీధులు, కాలనీల్లో రూ.1.66 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. ప్లాట్ నంబర్లు 47, 53, 125, 132, 192 పరిసర ప్రాంతాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రం, లక్ష్మీ నిలయం, బాలాజీ కిరాణం, మెథడిస్ట్ చర్చి తదితర ప్రాంతాల్లో రహదారులను అభివృద్ధి చేయనున్నారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే నార్సింగి, ఖానాపూర్, గండిపేట, వట్టినాగులపల్లి ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పార్కులు, గ్రంథాలయం వంటి సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా అంతర్గత రహదారుల సమస్యలకు పరిష్కారం లభించడంతో కాలనీవాసులకు ప్రయాణ ఇబ్బందులు తగ్గనున్నాయి. పెరుగుతున్న జనాభా, వేగంగా విస్తరిస్తున్న పట్టణ ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ఈ పనులు దోహదపడనున్నాయి.

కోటపల్లి అభివృద్ధికి రూ.1.60 కోట్లతో పనులు: మంత్రి వివేక్





ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో మెరుగైన సదుపాయాలు కల్పిస్తాం

విద్యార్థులకు అల్పాహారం.. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు

విద్య, వైద్య రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం

మంచిర్యాల,నవంబర్ 6 (క్రైమ్ మిర్రర్): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలో శుక్రవారం ఆయన విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కోటపల్లిలో రూ.1.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ నిర్మాణ పనులను ప్రారంభించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎస్సీ వసతి గృహ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినుల సౌకర్యార్థం అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. కోటపల్లి మండలంలోనూ విద్యార్థులకు అల్పాహార పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. పౌష్టికాహారం అందితేనే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటూ చదువులో రాణిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నామని చెప్పారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గత పదేళ్లలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, తమ ప్రభుత్వం అర్హులకు కొత్త కార్డులు అందిస్తోందని తెలిపారు. మూడు లక్షల మందికి పెన్షన్లు అందించినట్లు పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, వైద్యం కోసం మంచిర్యాల, కరీంనగర్, హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.70 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. పుష్కరాల అభివృద్ధి పనులకు రూ.80 కోట్లతో పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. చెన్నూరు పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రజలంతా నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని మంత్రి కోరారు. పంటలకు సాగునీరు అందించడం లేదంటూ ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన కొన్ని ప్రాజెక్టుల్లో సమస్యలు తలెత్తడం వల్ల ప్రస్తుత పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించే ప్రాజెక్టుల నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మించి ఉంటే ప్రస్తుత కరువు పరిస్థితులు వచ్చేవి కావని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్డియాక్, న్యూరోవాస్కులర్ చికిత్సలకు అత్యాధునిక సాంకేతికత

ఫైనాన్స డిస్ట్రిక్ట్ మెడికవర్ ఆసుపత్రిలో నూతన క్యాథ్‌ల్యాబ్ ప్రారంభం

కానన్ ఆల్ఫెనిక్స్ బైప్లేన్ సిస్టమ్ అందుబాటులోకి



గండిపేట(క్రైమ్ మిర్రర్): గుండె, మెదడు రక్తనాళాల సంబంధిత వ్యాధులకు మరింత కచ్చితమైన, అధునాతన చికిత్సలు అందించేందుకు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో అత్యాధునిక క్యాథ్‌ల్యాబ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆధునిక కానన్ ఆల్ఫెనిక్స్ బైప్లేన్ ఇమేజింగ్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సాంకేతికతతో గుండె సంబంధిత వ్యాధులు, మెదడులోని రక్తనాళాల సమస్యలను మరింత స్పష్టంగా గుర్తించి, కచ్చితత్వంతో కూడిన చికిత్స అందించేందుకు అవకాశం కలుగుతుందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ విధానం ద్వారా అధునాతన ఇంటర్వెన్షనల్ చికిత్సలకు మరింత వెసులుబాటు కలగనుంది. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, ఐపీఎస్ హాజరయ్యారు. మెడికవర్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ. శరత్ రెడ్డి, సెంటర్ హెడ్ డాక్టర్ స్వరూప్, శరత్ చంద్ర తదితర వైద్యులు పాల్గొన్నారు. అత్యాధునిక వైద్య సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని ఆసుపత్రి ప్రతినిధులు తెలిపారు. వైద్య రంగంలో నూతన ఆవిష్కరణల దిశగా ఈ క్యాథ్‌ల్యాబ్ మరో కీలక ముందడుగుగా నిలవనుంది.

రైతులకు మరింత మెరుగైన సౌకర్యాలు

నార్సింగి మార్కెట్ యార్డులో నూతన క్యాటిల్ షెడ్ ప్రారంభం



గండిపేట(క్రైమ్ మిర్రర్): రైతుల సంక్షేమం, వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ నార్సింగి వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన క్యాటిల్ షెడ్‌ను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ ప్రారంభించారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే క్రమంలో ఈ షెడ్‌ను అందుబాటులోకి తీసుకురావడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మిశ్రీ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం, మార్కెట్ అభివృద్ధికి నిరంతరం ప్రాధాన్యత ఇస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా నిర్మించిన క్యాటిల్ షెడ్ మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. రైతుల అవసరాలను గుర్తించి ఇలాంటి సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే సహకారంతో నార్సింగి వ్యవసాయ మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని లక్ష్మిశ్రీ తెలిపారు. రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, మెరుగైన వసతులు కల్పించేందుకు తన వంతు బాధ్యతగా పనిచేస్తానని అన్నారు. మార్కెట్ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, కమిటీ సభ్యుల సహకారం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్, వైస్ చైర్మన్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ ముదిరాజ్, అశోక్ యాదవ్, మణికొండ మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తలారి ప్రేమ్ కుమార్, ఏర్పుల కుమార్, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మార్కెట్ కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

తెలంగాణ పోలీసుల ఆరోగ్యం కోసం 'ఫిట్ కాప్'..

తెలంగాణ పోలీస్ శాఖ తమ సిబ్బంది ఆరోగ్యం, శ్రేయస్సును మెరుగుపరిచేందుకు ఒక కీలకమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 90 వేల మందికి పైగా పోలీసు సిబ్బంది కోసం 'ఫిట్ కాప్' అనే సమగ్ర ఆరోగ్య నిర్వహణ యాప్‌ను తీసుకురానున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ శుక్రవారం ప్రకటించారు. విధి నిర్వహణలో తీవ్రమైన ఒత్తిడి, సమయాభావం కారణంగా సిబ్బంది ఆరోగ్యంపై దృష్టి పెట్టలేకపోతున్నారని, ఈ యాప్ ఆ లోటును భర్తీ చేస్తుందని ఆయన తెలిపారు. హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్, ఇతర సంస్థల సహకారంతో 'టీజీ ఫిట్‌కాప్' పేరుతో ఈ పోలీస్ హెల్త్ మేనేజ్‌మెంట్ ప్రొఫైల్ సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నారు. రాబోయే 30 నుంచి 45 రోజుల్లో దీన్ని అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు డీజీపీ కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ యాప్ ద్వారా సిబ్బంది తమ వ్యక్తిగత ఆరోగ్య వివరాలను నమోదు చేయవచ్చు. మధుమేహం, రక్తపోటు, బాడీ మాస్ ఇండెక్స్ (దీవీ×), జీవనశైలి అలవాట్లు, ధూమపానం, మద్యపానం వంటి కీలక సమాచారాన్ని సేకరిస్తారు. సిబ్బంది తమ మొబైల్ ఫోన్ నంబర్‌తో ఈ సిస్టమ్‌లోకి లాగిన్ కావచ్చు. వారు అందించిన సమాచారం ఆధారంగా వారిని తక్కువ, మధ్యస్థ, అధిక రిస్క్ గ్రూపులుగా వర్గీకరిస్తారు. ఈ రిస్క్ అసెస్‌మెంట్ ద్వారా ఎవరికి తక్షణ వైద్య సహాయం అవసరమో గుర్తిస్తారు. హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సల్మాన్ మాట్లాడుతూ, రిస్క్ స్థాయిని బట్టి ప్రత్యేక కాల్ సెంటర్ ద్వారా సిబ్బందిని సంప్రదిస్తామని తెలిపారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
10 | శనివారం | 7-11-2026



నార్సింగి సర్కిల్‌లో నో బిన్ -- నో ట్రేడ్ తనిఖీలు

30 దుకాణాలకు రూ.3 వేల జరిమానా

గండిపేటక్రైమ్ మిర్రర్: వ్యాపార సంస్థలు పారిశుధ్య నిబంధనలు తప్పనిసరిగా పాటించాలనే లక్ష్యంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నార్సింగి సర్కిల్-45 అధికారులు నో బిన్ -- నో ట్రేడ్ కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం గండిపేట గ్రామంలోని 126వ వార్డులో అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 30 వ్యాపార సంస్థలను పరిశీలించగా, చెత్త సేకరణకు అవసరమైన బిన్లు ఏర్పాటు చేసుకోని 30 దుకాణాలకు ఒక్కొక్క దుకాణానికి రూ.100 చొప్పున మొత్తం రూ.3,000 జరిమానా విధించారు. వ్యాపార సంస్థల యజమానులు పారిశుధ్య నిబంధనలను నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రతి వ్యాపార సంస్థలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు తప్పనిసరిగా ప్రత్యేక డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దుకాణాల పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం లేదా పారబోయడం చేయకూడదని హెచ్చరించారు. పారిశుధ్య నిర్వహణ కేవలం మున్సిపల్ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, వ్యాపారులు, ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపార సంస్థలపై జరిమానాలు విధించడంతో పాటు తనిఖీలను నిరంతరం కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. పరిశుభ్రమైన నార్సింగి సర్కిల్ నిర్మాణమే లక్ష్యంగా నో బిన్ -- నో ట్రేడ్ కార్యక్రమాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయనున్నట్లు నార్సింగి సర్కిల్-45, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వెల్లడించారు.

మొరసు తుఫాన్ బాధితులను తక్షణమే ఆదుకోవాలి

సిపిఐ(ఎం) పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్



ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: మురసు తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఐ(ఎం) పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం నేలకొండపల్లి రావెళ్ల సత్యనారాయణ భవనంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. గత రెండు రోజులు క్రితం మురసు తుఫాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాలలో చేతికొచ్చిన వరి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బ తినడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల సాగు కోసం ఆరుగాలం శ్రమించిన అన్నదాతలకు ప్రకృతి వైపరీత్యాలతో ప్రతి ఏటా తీవ్ర నష్టం వాటిల్లుతుందని తద్వారా రైతులు చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఒకవైపు ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో తో రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో పాటు, ప్రకృతి వైపరీత్యాలు అన్నదాతలను ప్రతి ఏటా కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయన్నారు. భూమిని నమ్మిన రైతు బ్రతుకు రోజురోజుకు మరింత దుర్భరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు రైతులను తక్షణమే ఆదుకునేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలని డిమాండ్ చేశారు. మురసు తుఫాను ప్రభావంతో తీవ్రంగా దెబ్బతిన్న పంటలకు ఎకరానికి 50వేల రూపాయలు, పాక్షికంగా దెబ్బతిన్న పంటలకు ఎకరానికి 30 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం ఉద్యమిస్తున్న అఖిల భారత కిసాన్ సభ జాతీయ మహాసభలు ఈనెల 15 నుండి 18 వరకు నల్లగొండ పట్టణంలో ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగుతున్నాయన్నారు. ఈ మహాసభలకు ఏఐకేఎస్ జాతీయ నాయకులతో పాటు దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో అనుభవజ్ఞులైన 2 వేల మంది రైతు ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. 15వ తేదీన లక్ష మంది రైతులతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలాదిమంది రెడ్ షర్టు వాలంటీర్ల కవాతుతో నల్లగొండ పట్టణమంతా ఎరుపుమయం కాబోతుందన్నారు. ఈ మహాసభలకు రైతులతోపాటు వ్యవసాయ కూలీలు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజానీకం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, సిపిఐ(ఎం) మండల కార్యదర్శి కెవి రామిరెడ్డి, సీనియర్ నాయకులు ఏటుకూరి రామారావు, మందడపు మురళీకృష్ణ పాల్గొన్నారు.

కార్మికుల కొరతతో మున్సిపల్ సిబ్బందిపై పని ఒత్తిడి

సిబ్బందిని పెంచి, పెరిగిన వేతనాలు చెల్లించాలి.. సర్కిల్ కమిషనర్‌కు సీఐటీయూ వినతి

గండిపేటక్రైమ్ మిర్రర్: నార్సింగి సర్కిల్-45 పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జాజాల రుద్రకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన నార్సింగి సర్కిల్ పరిధిలో పర్యటించి పారిశుధ్య కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సర్కిల్ కమిషనర్ జి. లక్ష్మారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా జాజాల రుద్రకుమార్ మాట్లాడుతూ.. నార్సింగి సర్కిల్ పరిధిలో జనాభా రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ, అందుకు అనుగుణంగా మున్సిపల్ కార్మికుల సంఖ్యను పెంచకపోవడంతో ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందిపై తీవ్ర పని ఒత్తిడి పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఆరు వార్డులకు కేవలం ఆరుగురు కామాటీలు మాత్రమే ఉండేవారని, ప్రస్తుతం కూడా సిబ్బంది కొరత కొనసాగుతోందని తెలిపారు. డాక్టర్లు, డ్రైవర్లు కేవలం ఇద్దరే ఉండటం, మహిళా కార్మికుల సంఖ్య కూడా తక్కువగా ఉండటంతో పారిశుధ్య నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. నార్సింగి సర్కిల్ పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని, ఒకవైపు నగర విస్తరణ వేగంగా జరుగుతూ భారీగా నిర్మాణాలు చేపడుతున్నారని, మరోవైపు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికులను నియమించడం లేదని విమర్శించారు. వెంటనే జనాభా ప్రాతిపదికన అవసరమైన పారిశుధ్య కార్మికులు, ఇతర సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చెల్లిస్తున్న విధంగా కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలని కోరారు. ప్రస్తుతం పాత మున్సిపాలిటీ విధానంలోనే వేతనాలు చెల్లించడం వల్ల కార్మికులు నష్టపోతున్నారని తెలిపారు. పెరిగిన వేతనాలను తక్షణమే అమలు చేయడంతో పాటు కార్మికులకు చెప్పులు, సబ్బులు, నూనెలు, భద్రతా పరికరాలు, గుర్తింపు కార్డులు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. సిబ్బంది కొరత కారణంగా కార్మికుల మధ్య పనుల కేటాయింపుపై వివాదాలు తలెత్తుతున్నాయని, పని ఒత్తిడి పెరగడంతో కార్మికులు, సూపర్‌వైజర్ల మధ్య కూడా విభేదాలు ఏర్పడుతున్నాయని రుద్రకుమార్ పేర్కొన్నారు. ఈ పరిస్థితులకు ముగింపు పలకాలంటే తగినంత మంది సిబ్బందిని నియమించి, కార్మికుల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని కోరారు. కార్మిక సంఘం నాయకుల వినతిపై స్పందించిన సర్కిల్ కమిషనర్ లక్ష్మారెడ్డి వచ్చే నెల నుంచి పెరిగిన వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్మికులు ప్రస్తావించిన ఇతర సమస్యలను కూడా పరిశీలించి పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎస్. జనార్దన్ రెడ్డి, సీఐటీయూ మణికొండ సర్కిల్ కన్వీనర్ ఎం. అశోక్, సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకులు, గండిపేట మండల నాయకులు జి. రఘు తదితరులు పాల్గొన్నారు.



డీప్‌ఫేక్ వీడియోలతో ఎమ్మెల్సీకి బెదిరింపులు.. ఆరుగురి అరెస్ట్!

రూ.5 కోట్లకు డిమాండ్.. చివరకు రూ.5 లక్షలతో బేరం

రూ.4.70 లక్షల నగదు, రెండు ఆటోలు, ఆరు సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం



గండిపేటక్రైమ్ మిర్రర్: సోషల్ మీడియాలో మార్ఫింగ్ చేసిన ఫొటోలు, డీప్‌ఫేక్ వీడియోలు విడుదల చేసి రాజకీయ, సామాజిక ప్రతిష్ఠను దెబ్బతీస్తామంటూ తెలంగాణ శాసనమండలి సభ్యుడు మీర్జా రహ్మత్ బేగ్‌ను బెదిరించి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించిన ముఠా గుట్టును సైబరాబాద్ కమిషనరేట్ నార్సింగి పోలీసులు రట్టు చేశారు. ఈ వ్యవహారంలో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.4.70 లక్షల నగదు, రెండు ఆటోలు, ఆరు సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆర్థిక ఇబ్బందులతో త్వరగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో మొత్తం 14 మంది నిందితులు, మరికొందరు పరారీలో ఉన్న వ్యక్తులు కలిసి ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌ను లక్ష్యంగా చేసుకుని పథకం రూపొందించారు. ఆయనకు సంబంధించిన మార్ఫింగ్ ఫొటోలు, అభ్యంతరకరమైన రీతిలో రూపొందించిన డీప్‌ఫేక్ వీడియోలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తామని బెదిరించారు. వాటిని విడుదల చేస్తే రాజకీయ, సామాజికంగా పరువు ప్రతిష్ఠలు దెబ్బతింటాయని, ప్రాణహాని కూడా కలిగిస్తామని భయపెట్టినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. మొదటగా రూ.5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేసిన నిందితులు.. అనంతరం మధ్యవర్తి ద్వారా రూ.5 లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత మరో రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో నవంబర్ 5న నిందితురాలు ఫాతిమా బేగం అలియాస్ రీమా, మరో నలుగురితో కలిసి ఇబ్రహీంబాగ్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయానికి వెళ్లింది. అక్కడ ఎమ్మెల్సీ నుంచి రూ.4 లక్షల నగదు ఉన్న కాటన్ బాక్స్‌ను తీసుకుంది. అప్పటికే అందిన విశ్వసనీయ సమాచారంతో అప్రమత్తమైన నర్సింగి పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితుల కదలికలపై నిఘా పెట్టారు. నగదు తీసుకుని అక్కడి నుంచి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులు మెరుపు చర్యలు చేపట్టి ఫాతిమా బేగంతో పాటు మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మరో నిందితుడు మహ్మద్ మొహ్సిన్ ఖాన్‌ను కూడా అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్‌లో మొత్తం ఆరుగురు పోలీసులకు చిక్కారు. పౌల్ట్రీ వ్యాపారం మహ్మద్ మొహ్సిన్ ఖాన్ (35), ఫాతిమా బేగం అలియాస్ రీమా (29), మహ్మద్ సమీర్ (20), మహ్మద్ జమీర్ (20), మహ్మద్ ఇమ్రాన్ (18), సయ్యద్ రెహాన్ (20) వీరంతా హైదరాబాద్‌లోని బండ్లగూడ, చాంద్రాయణగుట్ట, బార్కస్ ప్రాంతాలకు చెందినవారిగా పోలీసులు గుర్తించారు. ఈ కుట్రలో ప్రధాన నిందితుడుతో పాటు మరికొందరు మార్ఫింగ్ ఫొటోలు, డీప్‌ఫేక్ వీడియోలను సేకరించడం, రూపొందించడం, వినియోగించడం, బెదిరింపులకు పాల్పడటంలో కీలకంగా వ్యవహరించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మరో నిందితుడు ఏ-14తో పాటు పరారీలో ఉన్న వ్యక్తులు వివిధ సోషల్ మీడియా ఖాతాల ద్వారా వాటిని ప్రచారం చేసేందుకు ప్రయత్నించినట్లు గుర్తించారు. ఈ కేసులో రూ.4.70 లక్షల నగదుతో పాటు రెండు ఆటోలు, ఆరు సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ఏ-1, ఏ-4 నుంచి ఏ-9 వరకు, ఏ-14తో పాటు ఇతర నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ కుట్రలో మరెవరైనా భాగస్వాములుగా ఉన్నారా? మార్ఫింగ్, డీప్‌ఫేక్ కంటెంట్‌ను ఎక్కడి నుంచి సేకరించారు? వాటిని ఏయే సోషల్ మీడియా ఖాతాల ద్వారా ప్రచారం చేయాలని భావించారు? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. మార్ఫింగ్ ఫొటోలు, డీప్‌ఫేక్ వీడియోల పేరుతో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే ప్రజలు భయపడి డబ్బులు చెల్లించవద్దని పోలీసులు సూచించారు. వెంటనే సమీప పోలీస్‌స్టేషన్ లేదా సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాలని కోరారు. బెదిరింపులకు సంబంధించిన ఫోన్ నంబర్లు, మెసేజ్‌లు, సోషల్ మీడియా ఖాతాలు, ఫొటోలు, వీడియోలు, నగదు లావాదేవీల వివరాలను ఆధారాలుగా అందించాలని తెలిపారు. అలాగే మార్ఫింగ్ చేసిన ఫొటోలు, డీప్‌ఫేక్ వీడియోలు, ఇతర అభ్యంతరకరమైన డిజిటల్ కంటెంట్‌ను ఇతరులకు ఫార్వర్డ్ చేయడం లేదా సోషల్ మీడియాలో ప్రచారం చేయడం చేయవద్దని హెచ్చరించారు. అటువంటి చర్యలు కూడా చట్టపరమైన పరిణామాలకు దారితీస్తాయని స్పష్టం చేశారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో, శేరిలింగంపల్లి జోన్ డీసీపీ, అదనపు డీసీపీ, నర్సింగి ఏసీపీ మార్గదర్శకత్వంలో నర్సింగి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓ, దర్యాప్తు బృందం ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.



ముచ్చింతల్‌లో చినజీయర్ స్వామి 70వ జయంతి వేడుకలు

నెల 8 నుంచి 12 వరకు ఐదు రోజుల పాటు యతీంద్ర సప్తతి ఉత్సవాలు

గండిపేట(క్రైమ్ మిర్రర్): శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామీజీ 70వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్ జీయర్ ఆశ్రమంలో నవంబర్ 8 నుంచి 12 వరకు ఐదు రోజుల పాటు 'యతీంద్ర సప్తతి' వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా వేద పండితులకు పురస్కారాలు, సుందరకాండ పారాయణం, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, సమతా పురస్కారాలు, మహిళా ప్రముఖులకు సత్కారాలు నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో విశేష సేవలందించిన 70 మంది ప్రముఖులకు సమతా పురస్కారాలు, 70 మంది మహిళా కు మాతృసవనం కార్యక్రమంలో సన్మానం చేయనున్నారు. నవంబర్ 12న శ్రీరామచంద్ర స్వామివారికి 1,000కి పైగా కలశాలతో సహస్ర కలశాభిషేకం నిర్వహించి వేడుకలను ముగించనున్నారు. ఈ ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు పాల్గొననున్నారు.

పీఏసీఎస్ డైరెక్టర్ గంగదారి మల్లేష్‌కు ఘన సన్మానం

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (వెల్దండ): వెల్దండ మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్‌గా సమావేశం వెల్దండ మండలం రాచూరు గ్రామానికి చెందిన గంగదారి మల్లేష్ నియామకం కావడంతో గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఈ సందర్భంగా రాచూరు గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు గంగదారి మల్లేష్‌కు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలియజేశారు. అనంతరం కేక్ కట్ చేసి తమ సంతోషాన్ని పంచుకున్నారు. పీఏసీఎస్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన గంగదారి మల్లేష్ రైతుల సంక్షేమానికి, సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. తనకు లభించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ రాఘవేందర్ రెడ్డి, గుత్తి వెంకటయ్య, రాధాకిషన్, తాజుద్దీన్, బాలయ్య తదితర గ్రామ నాయకులు పాల్గొని గంగదారి మల్లేష్‌కు అభినందనలు తెలిపారు.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.